

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

కరీంనగర్ fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-11-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 291 పేజీలు: 8+16 వెల: 6.50

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఇడి దాడులు 3

రష్యా అధినేత పుతిన్‌పై చైనాలో చిన్నచూపు! 5



ఫాల్కే అంతర్జాతీయ ఫిలింఫెస్టివల్‌లో
దురంధర్‌కు అవార్డుల పంట 3



గ్లోబల్ ప్రాధాన్యత కోల్పోతున్న భారత్
రాహుల్ గాంధీ ఆందోళన 5



పాక్ మంత్రి తాజ్‌మహల్ సందర్శనకు కేంద్రం నో
షాంఘై సహకార సంస్థ సమావేశానికి హాజరైన ముసాదిక్ మాలిక్ 3



ఎఐ పరిశోధనలకు అంతర్జాతీయ కేంద్రం హైదరాబాద్
పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూలం

గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్,నవంబరు20,ప్రభాతవార్త: హైదరాబాద్‌ను కృత్రిమ మేధ (ఎఐ), పరిశోధన, సాంకేతిక ఆధారిత వ్యాపారాలకు అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఐక్యరాజ్యసమితి (ఐరాస) వేదికగా 1ఎం1బి సంస్థ నిర్వహించిన గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో శుక్రవారం ఆయనపాల్గొన్నారు. తెలంగాణలో ఐటి, లైఫ్ సైన్సెస్, ఫార్మా స్యూటికల్స్, ఎఐ, అధునాతన తయారీ రంగాల్లో ఉన్న అవకాశాలను అంతర్జాతీయ ప్రతినిధులకు ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణ ఇప్పటికే ఐటి, లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు సాధించిందని, ప్రస్తుతం ఎఐ, అధునాతన తయారీసహా నూతన సాంకేతికరంగాల్లోనూవేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రతిభావంతులైన యువత, పరిశ్రమలకు >>2

విద్యల రేడుకు శత వసంతాలు
చుక్కా రామయ్య పుట్టిన రోజు విద్యా రంగానికి పర్వదినం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు అందించి సత్కరించిన సిఎం



రామయ్యకు స్వయంగా శుభాకాంక్షలు తెలిపిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావు, విహెచ్, పలువురు నేతలు, విద్యార్థులు 3లో

అమిత్‌షా హైదరాబాద్‌లో గెలుస్తారా?



శుక్రవారం హైదరాబాద్‌లో 'సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026'లో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి

అసదుద్దీన్‌పై పోటీచేసే ధైర్యం ఆయనకు ఉన్నదా?

డీలిమిటేషన్‌తో దక్షిణాది ప్రాధాన్యతకు గొడ్డలిపెట్టు

బిఆర్ఎస్వే ప్రధాన ప్రత్యర్థి, బిజెపి కాదు..

సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో సిఎం రేవంత్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు20: కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు నిజంగా ధైర్యం ఉంటే హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి స్థానిక ఎంపీ అసదుద్దీన్ ఒవైసిని ఓడించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కేవలం హిందూ ఓట్ల కోసం మోడీ, అమిత్ షా ప్రయత్నం చేస్తే, ముస్లిం ఓట్ల కోసం అసదుద్దీన్ ఒవైసీ ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అంతే తప్ప వారి మధ్య పెద్దగా ఏమీ పోటీ లేదని అన్నారు. అయితే, కాంగ్రెస్ మాత్రం అన్ని వర్గాలను కలుపుకుని వెళ్తోందని ఆయన ఉద్ఘాటించారు. ఇక లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచితే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది అవసరం లేకుండా పోతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఉత్తరాది సీట్ల బలంతోనే అధికారం దక్కించుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డీలిమిటేషన్ తర్వాత మొత్తం 850 సీట్లలో ఉత్తరాదికి 650 సీట్లు, దక్షిణాదికి సుమారు 195 సీట్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇది దక్షిణ భారత ప్రాధాన్యాన్ని తుడిచిపెట్టే కుట్ర అని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలంటే చట్టాలు, రాజ్యాంగాన్ని మార్చాల్సిన పనిలేదని, ఉన్న 543 సీట్లలోనే 181 సీట్లను మహిళలకు కేటాయించవచ్చని ఆయన సూచించారు. కాగా, తెలంగాణలో తమకు ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బిఆర్ఎస్సేనని, రాష్ట్రంలో బిజెపికి ఉనికి లేదని వ్యాఖ్యానించారు. తన రామాయణ కథలో కెసిఆర్ 'రావణాసురుడు' అయితే కెటిఆర్ 'మేనేజ్‌మెంట్ కోటానేత' అని ఎద్దేవా చేశారు. శుక్రవారం 'సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026'లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొని >>2

మెస్సీని తీసుకొచ్చాం.. త్వరలో రొనాల్డోను రప్పిస్తాం: సిఎం రేవంత్ 2

పక్కాగా భూ రికార్డులు

రైతుల సమక్షంలోనే కొలతలు

లీ సర్వేలో నిర్లక్ష్యానికి తావులేదు..

అభ్యంతరాలకు తక్షణ పరిహారం

కలెక్టర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి పొంగులేటి



హైదరాబాద్,నవంబరు20,ప్రభాతవార్త: రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, ప్రతి రైతుకు తన భూమిపై స్పష్టమైన, వివాదరహితమైన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, క్షేత్రస్థాయి స్వాధీనం, రెవెన్యూ రికార్డుల మధ్య ఉన్న వ్యత్యాసాలను శాస్త్రీయంగా, పారదర్శకంగా గుర్తించి, భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు ఆస్కారం లేకుండా పక్కా భూ రికార్డులను రూపొందించడమే ఈ రీసర్వే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో రైతులే కేంద్రబిందువుగా ఉండాలని, వారి సమక్షంలోనే భూముల కొలతలు చేపట్టి, ప్రతి దశలో వారికి పూర్తి సమాచారం అందించాలని సూచించారు.

భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సిసిఎల్ఎ) రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఒపి) మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో తూ.చ. తప్పకుండా అమలు చేయాలని, రీసర్వేను సాధారణ పరిపాలనా కార్యక్రమంగా కాకుండా ప్రత్యేక లక్ష్యంగా తీసుకొని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం-1923, తెలంగాణ భూ భారతి (భూమిలో హక్కుల రికార్డు) చట్టం2025 నిబంధనలకు అనుగుణంగా హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

మంత్రి పొంగులేటి సూచించిన కీలక మార్గదర్శకాలు: రీసర్వేకు ముందే రైతులకు పూర్తి అవగాహన కల్పించాలి. గ్రామాల్లో దండోరా >>2



ఎఐసిసి ఇన్‌చార్జి సందీప్ రేపు రాక

హైదరాబాద్,నవంబరు 20ప్రభాతవార్త: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఇంచార్జీ బిఎం సందీప్ ఈనెల 22,23న రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఎఐసిసి జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ ఈనెల 14న ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సందీప్ కర్నాటకలోని చిక్కమగుళూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇంతకు ముందు రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ కన్వీనర్‌గా ఎఐసిసి కార్యదర్శిగా గుజరాత్ మహారాష్ట్ర ఇంచార్జీగా కేరళ అదనపు ఐఎఐసిసి కార్యదర్శిగా పనిచేశారు. సందీప్ 22న ఉదయం గాంధీ భవన్‌లో జరగనున్న పొలిటికల్ ఎఫైర్స్‌కమిటి సమావేశంలో పాల్గొంటారు. పిసిసి పిఎసి సలహా కమిటీఉమ్మడిసమావేశం తరువాత మధ్యాహ్నం పిసిసి విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొంటారు. సందీప్23న గాంధీ భవన్‌లో ఉదయం మంత్రులతో వన్ టు వన్ సమావేశం జరుపుతారు,. మధ్యాహ్నం నుంచి డిసిసి అధ్యక్షులు అనుబంధ సంఘాల అధ్యక్షులతో వన్ టువన్ సమావేశాలలోపాల్గొంటారు.27న తెలంగాణలో ఎమ్మెల్సీలు, ఎంపిలు ఎమ్మెల్యేలతో వన్‌టు వన్ సమావేశాలు జరుపుతారు.

ఢిల్లీకి చక్కర్లలో రేవంత్‌దే రికార్డు

సంచులు మోయడంలోను ఆయనకు 10/10 మార్కులు

ఆయన ఒక వన్‌టైమ్ వండర్ లీడర్..

2028లో బిఆర్ఎస్‌కే మళ్లీ అధికారం

సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో కెటిఆర్



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సదరన్ రైజింగ్ సమ్మిట్-2026 లో కెటిఆర్..

హైదరాబాద్,నవంబరు20,ప్రభాతవార్త: ఢిల్లీకి సంచులు మోయడంలో, ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పదికి పది మార్కులు ఇవ్వొచ్చని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో మాత్రం ఆయనకు ఎలాంటి మార్కులు ఇవ్వలేమని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఒక వన్ టైమ్ వండర్ లీడర్ అని, 2028 డిసెంబరునాటికి ఆయన రాజకీయ ఎటిఎం గడువు ముగుస్తుందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఎటిఎంగా మారారని, 2028లో బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సదరన్ రైజింగ్ సమ్మిట్-2026 మీడియా కాంక్లేవ్‌లో >>2



కొత్త బడ్జెట్‌పై కసరత్తు షురూ
కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ అధ్యక్షతన సమావేశం 3



తిరుప్పనకుండ్రం కొండపై
కార్తిక దీపం 3
సుప్రీం కోర్టు తాత్కాలిక అనుమతి



మరింత పెరిగిన
చలి
తొలిసారి 9.6° పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రత

హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త : తెలంగాణలో చలి పంజా విసురుతోంది. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఉష్ణోగ్రతలు భారీగా పడిపోగా, ఈ సీజన్‌లో తొలిసారిగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఉత్తర దిశ నుంచి వీస్తున్న పొడి చల్లటి గాలుల ప్రభావంతోనే పశ్చిమ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనూ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో రాష్ట్రంలో కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. తెలంగాణలో ఈ నెలలో మొదటి సారగా ఒకే అంకె కనిష్ట ఉష్ణోగ్రత శుక్రవారం నమోదైంది. జహీరాబాద్‌లోని సత్వార్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 9.6 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. అలాగే సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో 9.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత చోటు చేసుకుంది. వీటితో >>2



ఆశలన్నీ 'సమ్మక్క' పైనే

- వేసవి తాగునీటి బెంగ తీర్చనున్న ప్రాజెక్టు
- చత్తీస్‌గఢ్ సమ్మతితో వరంగల్, జనగామ, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు ఊరట
- పదిహేను రోజుల్లో ఉమ్మడి సర్వే నివేదిక

హైదరాబాద్, నవంబరు 20,ప్రభాతవార్త: ఎల్‌నినో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వేళ చత్తీస్‌గడ్ సమ్మక్క సాగర్ బ్యారేజీలో 81 మీటర్ల ఎత్తులో నీటి నిల్వకు సానుకూల వ్యక్తం చేయడంతో తెలంగాణలోని వరంగల్, జనగామ, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, జిల్లాలకు వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉంటుందని ఊరట కలిగింది. ఐదేళ్ల క్రితం సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మించినప్పటికి సాంకేతిక సలహా సలహాదారు కమిటి టిఎసి అనుమతులు రాకపోవడంతో నీటిని నిల్వ చేయని పరిస్థితి దాపురించింది.తొలుత కాంతనపల్లి వద్ద ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు వల్ల ఆ ప్రాంతంలో 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. తద్వారా 17 ఆదివాసీ గ్రామాల ముంపుతో పాటు భద్రత, మౌలిక సదుపాయాలపై కూడా ప్రభావం పడుతుందని గుర్తించారు. దీంతో ముంపు ప్రాంతాన్ని తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణప్రదేశాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద దీని నిల్వ సామర్థం 6.94 టీఎంసీలు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం దీనికిగాను మొదట డ్యాం సేఫ్టీచట్టం ప్రకారం ఈ బ్యారే >>2



అక్వాన్ తుఫాన్ కారణంగా ఒడిశా కోస్తాలోని గోపాల్‌పూర్ ప్రాంతంలో పాంగిపాల్గిన వరదనీరు

కేంద్రం హైదరాబాద్

>> అనుకూలమైన విధానాలు, బలమైన పారిశ్రామిక పునాదులు రాష్ట్రానికి ప్రధాన బలమని తెలిపారు. సాంకేతిక అభివృద్ధి కేవలం ఆర్థిక వృద్ధికే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎఐ, డిజిటల్ ఆవిష్కరణలను వైద్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి వంటి రంగాల్లో వినియోగించడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారాలు అందుబాటులోకి వస్తాయన్నారు. సాంకేతిక ప్రగతి, ఆవిష్కరణలు, మానవాభివృద్ధి సమాంతరంగా సాగినప్పుడే సమాజానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, అంతర్జాతీయ సంస్థలు సమన్వయంతో పనిచేసిన ప్పుడే బలమైన ఆవిష్కరణల వ్యవస్థ ఏర్పడుతుందన్నారు.ఆ దిశగా తమ ప్రభుత్వం ఇన్నోవేషన్ ఆధారిత ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తోందన్నారు. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంతో పాటు, వారి ఆలోచనలను ప్రపంచస్థాయి ఆవిష్కరణలుగా మలిచేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి... రైజింగ్ తెలంగాణ లక్ష్యసాధనలో భాగస్వామ్యంకావాలని మంత్రి శ్రీధర్‌బాబు పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, వినియోగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

మెస్సీని తీసుకొచ్చాం.. త్వరలో రొనాల్డోను రప్పిస్తాం: సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబరు20,ప్రభాతవార్త: దేశాభివృద్ధిలో నెహ్రూ, పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్ అందించిన ఆర్థిక, సంక్షేమ సంస్కరణలే తమకు ఆదర్శమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఎఐ సిటీ వంటి భారీ ప్రాజెక్టులతో ప్రపంచ స్థాయి గుర్తింపు తెస్తున్నామని తెలిపారు. గతమూడేళ్లలోనే 65 శాతం(పది మార్కులలో 6.5 మార్కులు) హామీలు అమలు చేశామని, మిగిలిన పనులను వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పెట్టుబడిదారులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటుతో పాటు, ఐటిఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుస్తున్నామని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి అంతర్జాతీయ వర్సిటీలు కూడా తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు.మరోవైపు క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, 8 వేల మంది క్రీడాకారులతో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని తెలంగాణకు తీసుకొచ్చామని, త్వరలోనే పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మెస్సీ తన అభిమాన క్రీడాకారుడని, గతంలో అర్జెంటీనా దిగ్గజం డిగో మారడోనా కూడా తన అభిమాన ఆటగాడని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ కళాశాలలు దూరంగా ఉండటంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్న పరిస్థితిని అధిగమించేందుకు ఇంటర్మీడియట్ విద్యను స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. విద్యుత్ పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

సిఎంకు దమ్ముంటే సిద్దిపేటలో పోటీ చేయాలి: వారీష్ రావు

హైదరాబాద్,నవంబరు20,ప్రభాతవార్త: దమ్ముంటే నువ్వే సిద్దిపేటలో కాంగ్రెస్ తరఫున నా మీద పోటీ చెయ్ అని మాజీ మంత్రి హరీశ్ రావు సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. సిద్దిపేటలో సిఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రసంగంపై ఆయన స్పందిస్తూ శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'ఎవ్వరో గెలిస్తే మంత్రి పదవి ఇవ్వడం ఎందుకు? నువ్వే రా, నేను బిఆర్ఎస్ నుంచి,నువ్వు కాంగ్రెస్ నుంచి పోటీ చేద్దాం, నువ్వో,నేనో తేల్చుకుందాం' అని సిఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఇందిరమ్మ జీవిత బీమా మీద సభ పెట్టి దాని గురించి మాట్లాడకుండా కేసీఆర్‌ను, కేటీఆర్‌ను, నన్ను 140 సార్లు తలుచుకున్నాడు. 63 సార్లు కేసీఆర్ పేరు, 53 సార్లు నా పేరు, 24 సార్లు కేటీఆర్ పేరు తీశాడని అంటే నీకు ఎంత భయం పట్టుకున్నదో చూడు అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఒక కోవర్ట్, సబ్‌వర్ట్, పర్వర్ట్ చంద్రబాబు జలదోపిడీకి సహకరించే కోవర్ట్, వ్యవస్థను భ్రష్ట పట్టించిన సబ్‌వర్ట్, వికృత మనస్తత్వం కలిగిన పర్వర్ట్ అని ఘాటుగా స్పందించారు. తెలంగాణకు నువ్వు చేస్తున్న ద్రోహాన్ని ప్రజలకు ఆధారాలతో సహా వివరిస్తాను. దమ్ముంటే అసెంబ్లీ పెట్టి మైక్ కట్ చేయకుండా ఉండు రేవంత్ రెడ్డి అని సవాల్ విసిరారు. సిద్దిపేటలో నిర్వహించిన ఇందిరమ్మ జీవిత బీమా సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో సీఎం తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారని ఎద్దేవా చేశారు. అసలు సభకు వచ్చిన పథకం గురించి మాట్లాడకుండా తన ఎత్తు, కేటీఆర్ గడ్డంవంటి వ్యక్తిగత విషయాలపై విమర్శలు చేయడానికే రేవంత్ వచ్చారా?అని ప్రశ్నించారు.

మరింత పెరిగిన చలి

>> పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల నుండి 14 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. కామారెడ్డి జిల్లా డోంగ్లీలో 10.5, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో 10.7, వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌లో 11, మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్, మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 12, నిజామాబాద్ జిల్లా వర్నిలో 12.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వచ్చే మూడు రోజులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌లో సైతం చలి ప్రభావం క్రమక్రమంగా పెరుగుతోంది. నగరంలో సాధారణంగా కంటే 4 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో మరో 10 రోజుల పాటు ఇదే తరహా వాతావరణం కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.

పక్కాగా భూరికార్డులు

>> వేయించి, గ్రామసభల ద్వారా రీసర్వే ఉద్దేశం, విధానం, ప్రయోజనాలను రైతులకు వివరించాలి, క్షేత్రస్థాయి సర్వేకు కనీసం నాలుగు రోజుల ముందుగానే సంబంధిత పట్టాదారులకు నోటీసులు అందించాలి, సర్వేకు రెండు రోజుల ముందుగా రైతులు తమ పొలాల సరిహద్దు మూలల్లో జెండాలు పాతుకునేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, అటవీ భూముల సరిహద్దులను గుర్తించేందుకు ఫారమ్9, ఫారమ్ 10 నోటీసులు జారీ చేయాలి,ప్రభుత్వ భూముల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆక్రమణలకు ఎలాంటి అవకాశం లేకుండా సరిహద్దులను నిర్ధారించాలి,రైతుల సమక్షంలోనే కొలతలు.. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన లెక్కలు, ప్రతి భూమి పార్సిల్ కొలతలను పారదర్శకంగా నిర్వహించాలి,సర్వే పూర్తయిన వెంటనే వాస్తవంగా ఉన్న భూమి విస్తీర్ణాన్ని సంబంధిత రైతుకు అక్కడికక్కడే తెలియజేయాలి,రెవెన్యూ రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయి కొలతలకు మధ్య తేడాలు ఉంటే రైతుల దృష్టికి తీసుకెళ్లాలి,ఆ వ్యత్యాసాలకు గల కారణాలను ఫీల్డ్ రిజిస్టర్‌లోని రిమార్క్స్ కాలమ్‌లో స్పష్టంగా నమోదు చేయాలి,సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత వివరాలను భూ భారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

భూ వివాదాల పరిష్కారానికి గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాలు

రికార్డుల్లోని వివరాలకు, క్షేత్రస్థాయి స్వాధీనానికి మధ్య వ్యత్యాసాలు ఉన్న ప్రాంతాల్లో తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలి,అవసరమైన చోట మూడు నుంచి నాలుగు రోజుల పాటు గ్రామస్థాయి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి,గ్రామ పెద్దలు, పొరుగు భూముల రైతులు, సంబంధిత పట్టాదారుల సమక్షంలో చర్చలు జరిపి వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలి, ఉమ్మడి ఖాతాలు, ఉమ్మడి ఎల్‌పిఎంలు కలిగిన రైతులు పరస్పర అంగీకారంతో ఉపవిభజన (సబ్ డివిజన్) చేసుకునేలా ప్రోత్సహించాలి, చిన్నపాటి సరిహద్దు వివాదాలు సైతం భవిష్యత్తులో పెద్ద సమస్యలుగా మారకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి, ధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ.. అభ్యంతరాల పరిష్కారానికి ప్రాధాన్యత, సెక్షన్ 9(2) కింద నోటీసులు జారీ చేసిన అనంతరం అప్పీల్ వ్యవధిలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు స్వయంగా గ్రామాలను సందర్శించాలి,రైతులు సమర్పించిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవాల ఆధారంగా పరిష్కరించాలి,రైతులకు తమ వాదనలు వినిపించుకునే అవకాశం కల్పించాలి,అభ్యంతరాల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి,అన్ని అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించిన తర్వాతే ఆర్డీవో ఆమోదంతో సెక్షన్ 13 కింద తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి. తుది గెజిట్ అనంతరం భూ భారతి చట్టం ప్రకారం తహసీల్దార్లు రికార్డ్ ఆఫ్ రైట్స్, భూ భారతి పోర్టల్‌లో అవసరమైన సవరణలను పూర్తి చేయాలి,రీసర్వే ద్వారా రూపొందే తుది రికార్డులు చట్టబద్ధంగా, పారదర్శకంగా, భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

రైతులకు భరోసా కల్పించడమే రీసర్వే లక్ష్యం

భూరీసర్వే కార్యక్రమం ద్వారా కేవలం భూముల కొలతలు నిర్వహించడం మాత్రమే ప్రభుత్వ లక్ష్యం కాదని, దశాబ్దాలుగా పరిష్కారం కాని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం, భూముల సరిహద్దులను నిర్ధారించడం, రెవెన్యూ రికార్డులను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సరిచేయడం, రైతుల భూ హక్కులకు మరింత భద్రత కల్పించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏ ఒక్క రైతు కూడా అన్యాయానికి గురికాకూడదని, సర్వే ప్రక్రియలో చిన్నపాటి పొరపాట్లకు సైతం అవకాశం ఇవ్వకూడదని అధికారులకు సూచించారు. నిబంధనల అమలులో ఎక్కడా రాజీ పడకుండా, రైతుల విశ్వాసాన్ని చూరగొంటూ, పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

అమిత్‌షా హైదరాబాద్‌లో గెలుస్తారా?

>>ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన తాజా రాజకీయ పరిణామాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ఉండాలనే ఉద్దేశంతోనే బిఆర్ఎస్‌ను కొనసాగిస్తున్నామని, లేదంటే ఎప్పుడో ఖాళీ చేసేవారమని సిఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టదలిచిన డీలిమిటేషన్ (నియోజక వర్గాల పునర్విభజన) ప్రణాళిక ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించిన సమస్య కాదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ విషయం యావత్ దక్షిణ భారతదేశ ప్రజలందరి భవిష్యత్తుకు పెనుసవాల్ అని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియా కూటమిలోని కొన్ని మిత్రపక్షాలు ఈఅంశంపై మద్దతుఇస్తాయన్న ఊహాగానాలపై స్పందిస్తూ... ఎవరు మద్దతు ఇచ్చినా ఇవ్వకపోయినా తమకు అభ్యంతరం లేదనిఅన్నారు. కానీ ఈ విధానం అమలైతే దక్షిణాది ప్రాధాన్యత పూర్తిగా అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలం అత్యంత కీలకమని అన్నారు. గతంలో వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం కేవలం ఒక్క ఓటు తేడాతో కూలిపోయిన విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. బిజెపిచెబుతున్న సీట్లసంఖ్యను లెక్కించే విధానంపై మాట్లాడుతూ... "ప్రస్తుతం కేరళలో 20 మంది ఎంపీలు, ఉత్తరప్రదేశ్‌లో 80 మంది ఎంపీలు ఉన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య 60 సీట్ల వ్యత్యాసం ఉంది. ఒకవేళ 50 శాతం సీట్లు పెంచితే కేరళలో 30, యూపీలో 120 సీట్లు అవుతాయి. అప్పుడు ఆ వ్యత్యాసం 90 సీట్లకు చేరుతుంది. ఇంత భారీ తేడా ఏర్పడితే దక్షిణాది రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో పట్టించుకునే వారే ఉండరు" అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 175 (ఆంధ్ర), 119 (తెలంగాణ) సీట్ల సమీకరణంలో మెజారిటీ బలంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని, అందుకే పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆయన చెప్పుకొచ్చారు. రాష్ట్రాలు, జనాభా, జీడీపీ ఆధారంగా '50 శాతం ఫార్ములా'ను అమలు చేయాలని సూచించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడానికి కాంగ్రెస్ పార్టీ సహకరించిందని అన్నారు. ఇప్పుడు సంఖ్యాబలం ఉందని బెదిరించి బిల్లు పాస్ చేయించుకున్నా, భవిష్యత్తులో డీలిమిటేషన్ అమలైతే దక్షిణాదికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ ఒక 'విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్'లా మారారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన విదేశీ పర్యటనలకు లెక్క లేకుండా పోయిందని విమర్శించారు. ప్రధాని తన జీవితంలో ఏనాడు నిజం మాట్లాడలేదని ఆరోపించారు. బీజేపీ ఎప్పుడూ అబద్ధాలే చెబుతూ అధికారం కోసమే పాకులాడుతోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్నారు. జాతి, మతం, భాష పేరుతో విభేదాలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. భారత స్వాతంత్ర సమరయోధుల పోరాట ఫలితంగానే ఈ దేశంలో పేద, ధనిక, కులం, మతం తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చిందన్నారు. అయితే, పేదల ఓటు హక్కును తొలగించే కుట్ర జరుగుతోందని అన్నారు. రాహుల్ గాంధీ విదేశాల్లో మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని ఎలా చూస్తారన్న ప్రశ్నకు బదులుగా... చేగువేరా స్ఫూర్తే తమకు ఆదర్శమన్నారు. పేదల హక్కుల కోసం ఆయన ఏ దేశంలో సమస్య ఉంటే ఆ దేశంకు వెళ్ళి పోరాడారని అన్నారు. తాము కూడా ఆయన స్ఫూర్తితోనే ప్రజా సమస్యలపై పోరాడతామని చెప్పారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్ గద్దీ చోర్' నినాదానికి దేశవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని తెలిపారు. 12 ఏళ్ల పాలనలో ప్రధాని మోదీ రూ. 120 లక్షల కోట్ల అప్పులు చేశారని అన్నారు. మోదీకి ముందున్న ప్రధానులందరి అప్పు దాదాపు రూ. 53 లక్షల కోట్లు మాత్రమేనని అన్నారు. మరి ఇంత అప్పు చేసి ఆయన ఈ దేశంలో ఒక్క ప్రాజెక్టు నిర్మించలేదని, ఒక్క ప్రతి ష్టాత్మక విద్యాసంస్థ నిర్మించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ భాక్రనంగల్ ప్రాజెక్టు, నాగార్జున సాగర్, ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను నిర్మించారనిఅన్నారు. ఇందిరాగాంధీ పేదరిక నిర్మూలన, బ్యాంకుల జాతీయికరణ, రాజభరణాల రద్దు తదితర కీలక నిర్ణయం తీసుకున్నారనిఅన్నారు. టెలికం విప్లవంతో రాజీవ్‌గాంధీ టెక్నాలజీకి దేశంలో ఆజ్యం పోశార న్నారు. ఎల్పీజీ పాలసీలను పివి తీసుకొచ్చారని... ఆ తర్వాత మన్మోహన్‌సింగ్ వాటిని కొనసాగించి దేశ ప్రగతికి కారకులయ్యా రన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం పిఎం అయ్యాక దేశ ప్రజలను తిప్పలకు గురి చేస్తూ... అప్పులు చేస్తున్నారని... ఆ డబ్బును నేరుగాదోచి అదానీ జేబులో వేస్తున్నారని ఆగ్రహించారు. దేశంలో ఉన్న మిగతాముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల్లో ఎవరితో ఎక్కువ అనుబంధం ఉందని ప్రశ్నకు కర్నాటక సిఎం డికె శివకుమార్‌తో తన అనుబంధం చాలా ప్రత్యేకమని సిఎం రేవంత్ జవాబిచ్చారు. ఇక బిజెపిలో నచ్చిన సిఎం ఎవరని అడగ్గా... అసలు ఆ పార్టీలో మోదీ, అమిత్‌షా తప్ప వేరే పేరే తనకు తెలియదని అన్నారు.

ఆశలన్నీ 'సమ్మక్క' పైనే

>> జీలో నీటిని నింపి పరీక్షించాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ 81 మీటర్ల వరకు నీటి నిల్వకు సానుకూలత వ్యక్తం చేయడంతో గోదావరిలో ఎగువ నుంచి వచ్చే నీటిని బ్యారేజీలో నిల్వ చేయాలని నీటిపారుదల శాఖ వర్గాలు ఇంజినీర్లను ఆదేశించారు. దీంతో దశలవారీగా 5 టిఎంసిల వరకు నిల్వ చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ నిల్వ స్థాయిలో ఎటువంటి ముంపు ఉండదు. ప్రస్తుతంఎగువనుంచి రోజుకు పదివేలక్యూసెక్కుల ప్రవాహంవస్తోంది. దేవాదుల ఎత్తిపోతల పథకం కింద వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు తాగునీటి అవ సరాల సమస్య తీరుతుందని చెబుతున్నారు. సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఛత్తీస్ గఢ్ ఎన్ఒసి జారీకి సంబంధించి ఆ రాష్ట్ర జలవనరుల శాఖ, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ల బృందాలు ఉమ్మడి సర్వే ప్రారంభించాయి. ములుగు జిల్లా తుపాకులగూడెం సమీపంలో గోదావరిపై రూ.2,120 కోట్లతో 2021లో పూర్తిచేసిన బ్యారేజీ వెనక జలాలతో ఛత్తీస్‌గఢ్ బీజాపుర్ జిల్లాలోని భూపాలపట్నం తహసీల్ పరిధిలో ముంపు ఏర్పడుతోందని అక్కడి ప్రజలు అభ్యంతరం చెబుతూ నిరసనలు చేస్తున్నారు. దీనిపై గతంలో నిర్వహించిన అధ్యయనాల్లో గోదావరికి భారీ వరదలు వస్తే 100 ఎకరాల వరకు ముంపు ఏర్పడుతున్నట్లు తేల్చారు.

గతేడాది ఆ రాష్ట్రం ఖరగ్‌పూర్ ఐఐటితోనూ సర్వే చేయించింది. ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌లు ఆ రాష్ట్ర సిఎం విష్ణుదేవ్‌తో ఒప్పించడంతో ఉమ్మడి సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయి రెండు రాష్ట్రాల సిఇ బృందం సర్వే ప్రారంభించింది. 15 రోజుల్లో సర్వే పూర్తి చేసి ముంపు భూములను గుర్తించనున్నారు. కేంద్ర జల సంఘం వద్ద ఛత్తీస్‌గఢ్ సమ్మతే కీలకం. పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ అనుమతులతో పాటు తొలి, రెండో దశ అటవీ అనుమతులు ఇప్పటికే లభించాయని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. కేంద్ర జల సంఘం వద్ద పరిష్కారం కావాల్సిన ప్రధాన అంతర్రాష్ట్ర అంశం ఛత్తీస్‌గఢ్ సమ్మతేనని వివరించింది. తెలంగాణ ముఖ్య మంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి 2025 జనవరి 18, మార్చి 3, జూలై 14, సెప్టెంబరు 14, డిసెంబరు 13తో పాటు 2026 జూన్ 11నకూడా ఈ అంశంపై లేఖలు రాశారు.సాంకేతిక అంశాల్లో చాలా వాటిని పలుమార్లు పరిశీలించామని, నిర్ణయం తీసుకునేందుకు తగిన సమాచారం ఇప్పుడు అందుబాటులో ఉందని తెలంగాణ నేతలు తాజా భేటీలోతెలిపారు. ఛత్తీస్‌గఢ్ ప్రజల చట్టబద్ధమైన ప్రయోజనాలన్నింటినీ కాపా డుతూ తెలంగాణలో లక్షలాది మంది రైతులకు సాగునీటి భద్రత కల్పించాలన్నది తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

వారం - వర్జ్యం

21-11-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, అనురాధ కార్తె,
తి. ఏకాదశి ఉ.6.31, ద్వాదశి తె.4.55,
న.ఉత్తరభద్ర ఉ.6.50 . రేవతి తె. 5.54.
వ.ఉ.6.25 – ఉ.9.23
దు.ఉ.6.13 – ఉ.7.46
రాహు.ఉ.9.00–ఉ.10.30,శుభ స. ఉ.6.00 – ఉ.6.30.

వారఫలం

మేషం : ఆర్థికపరమైన లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

వృషభం : వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఓర్పుతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. ప్రయత్నాలు ఫలిస్తాయి.

మిథునం : రావలసిన పాత బాకీలు శ్రమానంతరం వస్తాయి. పెట్టుబడులలో తొందరపాటు వద్దు ఆలోచించి వెళ్ళండి.

కర్కాటకం : ఈరోజు దూరప్రయాణాలలో అటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. సంతాస విషయంలో చాలా శ్రద్ధ అవసరం.

సింహం : సన్నిహితులకు మీ సహాయ సహకారాలు అందిస్తారు. ఉద్యోగులకు బదిలీలు ఉంటాయి. క్రీడలయందు ఆసక్తి చూపుతారు.

కన్య : సంఘంలో మీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు పొందుతారు. కుంటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది.

తుల : ఆరోగ్యంపట్ల మెలకువ అవసరం, క్రయవిక్రయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం శ్రేయస్కరం.

వృశ్చికం : పారిశ్రామిక రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. సోదరులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

ధనుస్సు : కాంట్రాక్టులు చివరి నిమిషంలో దక్కుతాయి. కళాకారంగంలోని వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. పనులు సకాలంలో చేస్తారు.

మకరం : సెంటిమెంటు వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు తీసుకుంటారు. ఇంటా బయట మీదే పై చేయిగా ఉంటుంది.

కుంభం : రెండు మూడు విధాలుగా ధన లాభం పొందుతారు. గృహం కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు.

మీనం : ఎన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి అనుకున్న కార్యాన్ని పూర్తి చేయటానికి శ్రమిస్తారు. వస్తు లాభం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్



శుక్రవారం న్యూఢిల్లీలో డిఫెన్స్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

రూ.20 వేల కోట్లతో పట్టణాల అభివృద్ధి

అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్,నవంబరు20,ప్రభాతవార్త: రాష్ట్రంలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పురపాలక శాఖ రూపొందించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్షించారు. వాతావరణ మార్పులను తట్టుకునేలా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా పట్టణాలను అభివృద్ధి చేసే ప్రణాళికలపై చర్చించారు.ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి), ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు (ఎఐఐబి), జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యూ బ్యాంకుతో పాటు దేశీయ ఆర్థిక సంస్థల సహకారంతో దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు పురపాలక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, వరంగల్ కోట కందకం పునరుద్ధరణ, హనుమకొండలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు, ప్రధానంగా టెక్స్‌టైల్ పార్కులకు వినియోగించడం ద్వారా మంచినీటి వనరులపై ఒత్తిడి తగ్గించేందుకు అవకాశముంది. పట్టణాల్లో తాగునీటి సరఫరా, నీటి శుద్ధి, పంపిణీ వ్యవస్థల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించే అంశాలపై చర్చించారు. వరంగల్ మెగా సిటీ ఎకనామిక్ రీజియన్ పరిధిలో వ్యర్థాల నుంచి 10 నుంచి 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిచేసే ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను సమీక్షించారు. బయో సీఎన్‌జీ ఉత్పత్తి, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు.ఈ ప్రాజెక్టుల ద్వారా పట్టణాల్లో కర్బనఉద్గారాలను తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, వరద ముప్పును నివారించడం, పురపాలకసంస్థల నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, సీఎంవో కార్యదర్శి మాణిక్ రాజ్, పురపాలక శాఖ

ఒడిశాలోని థర్మల్ కేంద్రానికి నైనీ బొగ్గు

ఎన్టీపిసి సిఎండితో సింగరేణి సిఎండి ప్రకాష్ భేటీ

హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త: ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేయగా మిగిలిన బొగ్గును స్థానిక పరిశ్రమలతో పాటు. ఆ రాష్ట్రంలో ఉన్న నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)కు చెందిన కనిహా థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు సరఫరా చేయడానికి సింగరేణి సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎన్టీపీసీ సిఎండి గురుదీప్ సింగ్‌తో సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి శుక్రవారం న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బుద్ధ ప్రకాష్ తమ సంస్థకు చెందిన నైనీ బ్లాక్‌లో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి గురించి వివరించారు. తెలంగాణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి నైనీ బొగ్గులో అధిక భాగం సరఫరా చేస్తున్నామన్నారు. మిగిలిన బొగ్గును స్థానిక పరిశ్రమలకు సరఫరా చేస్తున్నట్టు వివరించారు. ఎన్టీపీసీతో ఇప్పటికే తమకున్న బొగ్గు సరఫరా ఒప్పందాలకు అనుబంధంగా ఒడిశాలోని కనిహా థర్మల్ విద్యుత్ ప్లాంట్ కూడా బొగ్గును అందించడానికి సంసిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఇప్పటికే తెలంగాణలోని ఎన్టీపీసీ ప్లాంట్లతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోనీ ఆ సంస్థకు చెందిన ప్లాంట్లకు ఒప్పందం ప్రకారం దశాబ్దాల కాలంగా బొగ్గు సరఫరా చేస్తోందని చెప్పారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో తెలంగాణ తర్వాత ఎక్కువ శాతం ఎన్టీపీసీ ప్లాంట్‌లకే సరఫరా చేస్తోందన్నారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ వచ్చే ఏడాది నుంచి సంవత్సరానికి 10 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయనుందని వెల్లడించారు. నాలుగు దశాబ్దాల పాటు ఈ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి జరగనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్టీపీసీ కనిహా థర్మల్ ప్లాంట్‌కు దీర్ఘకాలిక ఒప్పందంతో బొగ్గును అందించటానికి సింగరేణి సంసిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. దీనిపై ఎన్టీపీసీ సిఎండి గురుదీప్‌సింగ్ సానుకూలంగా స్పందించారు. తమ ప్లాంట్ కు అవసరమైన బొగ్గును ప్రస్తుతం ఇతర ప్రభుత్వ బొగ్గు సంస్థల ద్వారా స్వీకరిస్తున్నామని, నైనీ బొగ్గు బ్లాకు తమ ప్లాంట్‌కు సమీపంలోనే ఉన్నందున అక్కడి నుంచి కూడా బొగ్గు తీసుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వెంకన్న, జనరల్ మేనేజర్ టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల విచారణకు హాజరైన అభిషేక్ బెనర్జీ

బిజెపి నేతలపై ఫిర్యాదు



కోల్‌కతా, నవంబరు 20: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) జాతీయ ప్రధాన కార్యదర్శి, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీ శుక్రవారం కోల్‌కతాలోని గిరీష్ పార్క్ పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. పోలీసు సిబ్బందిని బెదిరించారనే ఆరోపణలపై నమోదైన కేసులో విచారణకు రావాలని పోలీసులు సమన్లు జారీ చేయడంతో ఆయన దర్యాప్తు అధికారిని కలిసి విచారణకు సహకరించారు.గతనెల 29న అభిషేక్ బెనర్జీ చేసిన కొన్ని వ్యాఖ్యలు పోలీ సులను బద రించేలా, భయ పెట్టేలా ఉన్నా యని, విధుల నిర్వ హణకు ఆటం కం కలిగించే విధంగా ఉన్నాయని ఆరో పిస్తూ 31న గిరీష్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బీజేపీ సభ్యురాలు, న్యాయవాది నాజియా ఎలాహీ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.అయితే పోలీసుల విచారణకు హాజరైన అభిషేక్ బెనర్జీ మరో కీలక పరిణామానికి తెరలేపారు. పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి, బీజేపీ నాయకులు దిలీప్ ఘోష్, సుకాంత మజుందార్ తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ గిరీష్ పార్క్ పోలీస్ స్టేషన్ అధికారికి ప్రత్యేక ఫిర్యాదు అందజేశారు.బీజేపీ నేతలు రాష్ట్ర పోలీసు వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని బెదిరింపు, భయపెట్టేలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని బెనర్జీ తన ఫిర్యాదులో ఆరోపించారు. పోలీసు సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి, వారి విధుల నిర్వహణలో జోక్యం చేసుకోవడమే ఈ వ్యాఖ్యల వెనుక ఉద్దేశమని పేర్కొన్నారు.పోలీసుల విచారణకు వెళ్లడానికి కొద్దిసేపటి ముందే బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యల సంకలనాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో ప్రచురించినట్లు ఆయన తెలిపారు.

దాదాసాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ అవార్డుల్లో

దురంధర్‌కు అవార్డుల పంట

ముంబయి, నవంబరు 20: దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 అవార్డులను శుక్రవారం ప్రకటించారు. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ చిత్రం అవార్డుల మోత మోగించింది. ఉత్తమ నటుడి అవార్డు రణవీర్ సింగ్‌ను వరించింది. సయారాలో నటనకు గానూ ఉత్తమ నటి అవార్డును అనీత్ పడ్డా సొంతం చేసుకుంది. ఉత్తమ చిత్రంగా ధురంధర్ నిలిచింది. ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ప్రముఖ గాయని టేలర్ స్విఫ్ట్ ఎంపికయ్యారు. సంగీత ప్రతిభ, పాటల రచనా నైపుణ్యం, అంతర్జాతీయ సాంస్కృతిక ప్రభావం, లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి ఆమె అందించిన సేవలను గుర్తిస్తూ టేలర్ స్విఫ్ట్‌కు ఈ పురస్కారాన్ని కమిటీ ప్రకటించింది. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ద్వారా భారతీయ సినిమా, వినోద రంగానికి చెందిన ప్రతిభావంతులను గుర్తించి అవార్డుతో సత్కరిస్తున్నారు. భారతీయ సినిమా పితా మహుడిగా ప్రసిద్ధి చెందిన దాదాసాహెబ్ ఫాల్కే పేరు మీద ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. సినీ నిర్మాణం, కళలు, వినోద రంగాలకు సంబంధించిన వివిధ విభాగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ వేదికపై పురస్కారాలను అందిస్తున్నారు.

ఫాల్కే అవార్డు విజేతలు వీళ్లే

ఉత్తమ చిత్రం: ధురంధర్
ఉత్తమ నటుడు: రణ్ వీర్‌సింగ్ (ధురం ధర్)
ఉత్తమ నటి: అనీత్ పడ్డా (సయారా)
ఉత్తమ దర్శకుడు: ఆదిత్యధర్ (ధురం ధర్)
ఉత్తమ సహాయ నటుడు: వినీత్ కుమార్ సింగ్ (ఛావా)



ఉత్తమ ప్రతినాయకుడు: అక్షయ్ ఖన్నా (ధురంధర్)
హాస్య ప్రధాన పాత్రలో ఉత్తమ నటుడు: రితేశ్ దేశ్‌ముఖ్ (హౌస్‌ఫుల్ 5)
ఉత్తమ సంగీత దర్శకుడు: శాశ్వత్ సచ్‌దేవ్ (ధురంధర్)
క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్: కాంతార: చాప్టర్1
క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్: రిషబ్‌శెట్టి (కాంతార: చాప్టర్1)
క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్: యామి గౌతమ్‌ధర్ (హక్)
ప్రొడ్యూసర్‌ఆఫ్ దిఇయర్: ఆదిత్యధర్,జ్యోతిదేశ్‌పాండే, లోకేశ్‌ధర్: ధురంధర్
ఉత్తమ కొరియోగ్రఫీ: శాండీ మాస్టర్ (కూలీమోనికా బెలూసీ)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: అరవింద్ ఎస్.కశ్యప్ (కాంతార: చాప్టర్1)
ఉత్తమ్ స్క్రీన్‌ప్లే అండ్ డైలాగ్: రీష నాథ్ (హక్)
ఉత్తమ గేయ రచయిత: ఇర్షద్ కమిల్ (సయారా)
ఉత్తమ నేపథ్య గాయకుడు: ఫహీమ్ అబ్దుల్లా (సయారా)
ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్: కరణ్ ఆజ్రా; సాంగ్ ఆఫ్ ది ఇయర్: సయారా
కమెడియన్ ఆఫ్ ది ఇయర్: సామే రైనా
అవుట్‌స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ మ్యూజిక్ ఇండస్ట్రీ: ఇళయరాజా
అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ ఫిల్మ్ ఇండస్ట్రీ: కమల్‌హాసన్
ఉత్తమ వెబ్‌సిరీస్: ది బ్యా డ్స్ ఆఫ్ బాలీవుడ్
ఉత్తమ వెబ్‌సిరీస్ దర్శకుడు: ఆర్యన్‌ఖాన్ (ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్)

కొత్త బడ్జెట్‌పై కసరత్తు షురూ

కేంద్ర ఆర్థికమంత్రి సీతారామన్ అధ్యక్షతన సమావేశం



న్యూఢిల్లీ, నవంబరు 20: కొత్తసంవత్సరానికి సంబంధించిన నూతన కేంద్ర బడ్జెట్ 2027 -28 రూపకల్పనకు సంబంధించి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ముందస్తు సంప్రదింపుల ప్రక్రియను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం న్యూఢిల్లీలో గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, సాంస్కృతిక రంగాల నిపుణులు, భాగస్వాములతో ఆమె తొమ్మిదో ముందస్తు బడ్జెట్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ కీలక భేటీలో కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి అనురాధ ఠాకూర్, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గృహ నిర్మాణ రంగంలో ప్రోత్సాహకాలు, పట్టణ మౌలిక సదుపాయాల ఆధునీకరణ, దేశీయ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ పై నిపుణుల నుంచి ఆర్థిక మంత్రి సలహాలు, సూచనలు స్వీకరించారు. దీనికి ముందు, శుక్రవారం ఉదయమే ఆర్థిక మంత్రి ఉపాధి, కార్మిక రంగాల భాగస్వాములతో ఎనిమిదో ముందస్తు బడ్జెట్ సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొని ఉపాధి అవకాశాల పెంపుపై తమ ప్రతిపాదనలను సమర్పించారు. వివిధ రంగాల ఆర్థిక ప్రాధాన్యతలను బడ్జెట్‌లో ప్రతిబింబించేలా నవంబర్ 16 నుంచి 26 మధ్య మొత్తం 14 విడతల్లో ఆర్థిక మంత్రి ఈ సంప్రదింపులు జరుపుతున్నారు. నిర్మలా సీతారామన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో నూతన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఇడి దాడులు

11 గంటలపాటు సుదీర్ఘంగా సాగిన సోదాలు

హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం హైదరాబాద్‌తో పాటు ఖానాపూర్‌లో ని ఆమె ఇళ్లు కార్యాలయాలలో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఖానాపూర్ మండలం సత్తెనపల్లి వద్ద రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం ధాన్యాన్ని కేటాయించింది. అయితే, 2022..2023, 2023..2024, 2024..2025 రబీ సీజన్లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంలో పెద్ద మొత్తంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.40.96 కోట్లు ఉంటుందని పౌరసరఫరాల శాఖ గుర్తించింది. గత ఆగస్టు నెలలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా ధాన్యం నిల్వలు మాయమైనట్లు తేలింది. దీనిపై జిల్లా పౌరసరఫరాల శా ఖ అధికారి ఫిర్యాదు చేయడంతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యా ప్తు చేపట్టిన ఈడీ అధికారులు తాజాగా రంగంలోకి దిగి సోదాలు చేబట్టారు. ఖానాపూర్‌లోని రేఖానాయక్ నివాసం వద్ద విజిలెన్స్, స్థానిక పో లీసు బలగాలు భారీగా మోహరించాయి. హైదరాబాద్, ఖానాపూర్‌లో గల ఆమె నివాసాల్లో రికార్డులను పరిశీలించిన అధికారులు వీటిని జప్తు చేశారు. ఆమెకు చెందిన రైస్ మిల్‌లో పనిచేసే వారిని విచారించి వాంగ్మూలం తీసేకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన సోదాలు రాత్రి ఏడు గంటల వరకు కొనసాగాయి. సోదాల అనంతరం ఈడీ అధికారులు మీడియాతో మాట్లాడకుండా వెనుదిరిగారు. రాష్ట్రంలో ధాన్యం గోల్‌మాల్ వ్యవహారంలో ఓ వైపు విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తున్న తరుణంలో ఈడీ అధికారులు రంగంలో దిగడం సంచలనం రేపింది.

నాకొచ్చే ఆదరణ చూసి ఓర్వలేకే ఇలా దాడులు: రేఖానాయక్ వెల్లడి

ఇదిలా ఉండగా తన రైస్ మిల్‌తో పాటు ఇళ్లపై జరిగిన ఈడీ దాడులపై రేఖా నాయక్ స్పందించారు. రాష్ట్రంలో అనేక రైస్ మిల్లులపై కేసులు ఉండగా, తన రైస్ మిల్లుపై మాత్రమే ఈడీ సోదాలు చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవాలని ఆమె కోరారు. ఇదొక రాజకీయ కుట్ర అంటూ ఆమె విమర్శించారు. ఓ గిరిజన మహిళ నాయకురాలుపై ఎదుగుదల ప్రజల ఆదరణ చూసి ఓర్వలేక ఇలా దాడు లు చేయడం సరికాదన్నారు. ఇలాంటి దాడులు ఎన్ని చేసినా తాను ప్రజలనుంచి వచ్చిన నాయకురాలునని, ప్రజలతోనే ఉంటానని స్పష్టం చేశా రు. ప్రభుత్వానికి బాకీ ఉన్న ప్రతి రూపాయి చెల్లిస్తానని, తనకు న్యాయ వ్యవస్థ పట్ల పూర్తి నమ్మకం ఉందని, ఈడి అధికారులు చేసిన విచారణకి పూర్తిగా సహకరించానని ఆమె తెలిపారు.

పాక్ మంత్రి తాజ్‌మహల్ సందర్శనకు కేంద్రం నో

షాంఘై సహకార సంస్థ సమావేశానికి హాజరైన ముసాదిక్ మాలిక్



న్యూఢిల్లీ, నవంబరు 20: ఢిల్లీలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సమావేశానికి పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ హాజరు కావడం రాజకీయ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. దేశ రాజధానిలోని చారిత్రాత్మక పురానా ఖిలాలో ఈ నెల 20 నుంచి 22 వరకు మొట్టమొదటి షాంఘై సహకార సంస్థ సివిలైజేషనల్ డైలాగ్ ఫోరమ్ జరుగుతోంది. తమ భారత పర్యటన సందర్భంగా మాలిక్ పలు ప్రదేశాలను సందర్శించాలని ప్రణాళిక వేశారని, అయితే ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని తాజాగా వెల్లడైంది. ఆగ్రాలోని తాజ్ మహల్, ఢిల్లీలోని నిజాముద్దీన్ దర్గాను సందర్శనకు పాకిస్థాన్ మంత్రి అనుమతి కోరారని, అయితే ఎస్సీ వో సమావేశానికి మించి ఇతరత్రా ఏ కార్యక్రమా లకూ భారత ప్రభుత్వం అనుమతి నిరాకరిం చిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో కేవలం ఎస్సీవో కార్యక్రమానికి మాత్రమే హాజరు కావాలని, మరే ఇతర ప్రదేశాలను సంద ర్శించకూడదని ఆయనకు స్పష్టం చేసినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. మూడేళ్ల తర్వాత భారత్‌లో ఓ పాకిస్థాన్ నేత పర్యటించడం ఇదే మొదటిసారి. చివరిసారిగా 2023లో గోవాలో జరిగిన ఎస్సీవో సమావేశానికి బిలావల్ భుట్టో జర్దారీ హాజరయ్యారు. సాంప్రదాయ నిబంధనలకు అనుగుణంగా, పాకిస్థాన్‌తో సహా అన్ని ఎస్సీవో సభ్య దేశాలకు ఆహ్వానాలు పంపినట్లు భారత్ అక్టోబర్ 28న ప్రకటించింది. ఆ తర్వాత ముసాదిక్ మాలిక్ ఈ సమావేశంలో పాల్గొంటారని పాకిస్థాన్ ప్రభుత్వం ధ్రువీకరించింది. 'పరస్పర గౌరవ స్ఫూర్తితో ఎస్సీవో ప్రేమ్‌వర్క్ పరిధిలో నాగరికతల మధ్య సంభాషణను ప్రోత్సహించడానికి, ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించడానికి పాకిస్థాన్ ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని ఇస్లామాబాద్ ప్రభు త్వం ప్రకటన పేర్కొంది.
పాకిస్థాన్ మంత్రిని ఆహ్వానించడంపై ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. పొరుగు దేశం పట్ల విధానాన్ని మార్చుకోవడానికి పహల్గామ్ ఘటన తర్వాత ఏం మారిందని అవి ప్రశ్నిస్తున్నాయి. అలాగే, పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంపై ముసాదిక్ మాలిక్ గతంలో చేసిన దుందుడుకు వ్యాఖ్యలను కూడా ప్రతిపక్షాలు ఎత్తిచూపు తున్నాయి. 2001లో షాంఘైలో జరిగిన ఒక శిఖరాగ్ర సమావేశంలో రష్యా, చైనా, కిర్గిజ్ రిపబ్లిక్, కజకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షులు ఎస్సీవోను ఏర్పాటుచేశారు. 2017లో భారత్, పాకిస్థాన్ ఇందులో శాశ్వత సభ్య దేశాలుగా చేరాయి. 2023లో ఇరాన్ సభ్యత్వం పొందింది. అక్టోబర్ 2024లో ఇస్లామాబాద్‌లో జరిగిన ఎస్సీవో కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ సమావేశానికి ప్రధాని తరపున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ హాజరయ్యారు. ఆ తర్వాత ఎస్సీవో కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్ సన్నాహక సమావేశం కోసం భారత్ గత నెలలో ఎస్సీవో జాతీయ సమన్వయకర్త అలోక్ దిమ్రీని ఇస్లామాబాద్‌కు పంపింది.

నగదు భారీగా డ్రా చేస్తే కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వండి

డిజిటల్ నేరాలపై కట్టడికి సైబర్ నిపుణుల సూచనలు

హైదరాబాద్ నవంబరు 20, ప్రభాతవార్త: విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని డిజిటల్ అరెస్టుల పేరిట సైబర్ నేరగాళ్లు కోట్లాది రూపాయలను కొల్లగొడుతుండడాన్ని నివారించేందుకు సైబర్ నిపుణులు ఆర్‌బిఐతోపాటు బ్యాంకులకు కీలక సూచనలు చేశారు. కాల పరిమితి ముగియని ఎఫ్‌డిలను ఉన్న పళంగా విత్‌డ్రా చేయడం, హఠాత్తుగా లక్షలాది నుంచి కోట్లాది రూపాయలు ఇతరుల ఖాతాకు బదలీ చేయాలని ఎవరైనా కోరిన సమయంలో బ్యాంకుల అధికారులు దీనిపై ఒకటికి పలుమార్లు ఆలోచించాలని, ఖాతాదారుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని సైబర్ నిపుణుల కోరుతున్నారు. వున్నట్లుండి పెద్దమొత్తంలో వృద్ధులు, మహిళలు తమ ఖాతాల నుంచి విత్‌డ్రా చేస్తున్నప్పుడు బ్యాంకుల అధికారులు వారి కుటుంబసభ్యులకు తెలపాలని సైబర్ నిపుణులు, పోలీసులు చెబుతున్నారు. పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా, ఎంతమేర ప్రకటనలు చేస్తున్నా డిజిటల్ అరెస్టులు ఆగకపోవడం, సైబర్ నేరగాళ్ల లూటీ కొనసాగుతూనే వుండడడంతో సైబర్ నిపుణులు రంగంలో దిగారు. ఈ విషయంలో నేషనల్ సైబర్ క్రైం పోర్టల్. తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు కూడా తమ వంతుగా బ్యాంకులకు సూచనలు చేయసాగారు. ఒక్క హైదరాబాద్‌లోనే యేటా పది కోట్ల రూపాయల వరకు డిజిటల్ అరెస్టుల పేరిట సైబర్ నేరగాళ్లు లూటీ చేస్తున్న విషయాన్ని వారు బ్యాంకులకు తెలిపారు. కొన్నిసార్లు గంటల తరబడి నుంచి రెండు రోజుల వరకు ఈ దోపిడి సాగుతుండడం గమనార్హం. కాగా డిజిటల్ అరెస్టు అనేది లేదని పోలీసులు పదే పదే చెబుతున్నా బాధితులు బెదిరిపోతుండడం గమనార్హం. దశాబ్దాలుగా ఇంటా, బయటా గౌరవంగా జీవించిన విశ్రాంత ఉద్యోగులు అకస్మాత్తుగా పోలీసులు, సీబీఐ అధికారుల మంటూ ఫోన్ కాల్స్ రాగానే ఆందోళనకు గురవుతున్న తీరు విస్మయ పరుస్తోంది. సరైన అవగాహన లేకపోవడం, అంతర్గత భయాల కారణ ంగా డిజిటల్ అరెస్ట్ అనగానే వీరంతా బెదిరిపోతున్నారు. తమ కుటుంబ సభ్యులకు ఏదైనా హాని జరుగుతుందేమోనన్న భయంతో కేటుగాళ్ల డిమాండ్లకు తలొగ్గుతున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఈ కారణంచేత అకస్మాత్తుగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు విత్‌డ్రా చేస్తుండడం, బంగారు నగ లను తాకట్టు పెట్టడంతో పాటు చివరికి ఇళ్లు, భూములను కూడా అమ్మేసి సైబర్ నేరగాళ్లకు ధారపోస్తున్నారని పోలీసులు బ్యాంకుల అధికారులకు చెబుతున్నారు. ఇటు వంటి సందర్భాలలో బ్యాంకుల అధికారులు కొంత అప్రమత్తంగా వుంటే డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలను చాలా వరకు నివారించవచ్చన్న వారు చెబుతున్నారు. ఇటువంటి సందర్భాలలో బ్యాంకుల అధికారులు ఖాతాదారుల కుటుంబ సభ్యులకు సమాచారమివ్వాలని వారు కోరుతున్నారు.

బడ్జెట్ కంటే 17 శాతం తక్కువ ఖర్చు

ప్రణాళికా వ్యయం గణనీయంగా తగ్గింపు
దీర్ఘకాలిక ఆస్తుల కల్పనపై ప్రత్యేక దృష్టి
పిఆర్ఎస్ లెజిస్లేటివ్ ఫైనాన్స్ రిపోర్ట్ వెల్లడి

హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయిలకన్నా తక్కువ ఖర్చు చేస్తోంది. రాష్ట్రంలో 2021-22 ఆర్థిక సంత్సరం నుండి 2024-25 మధ్య తన వార్షిక బడ్జెట్ అంచనాల కంటే 17 శాతం తక్కువ ఖర్చు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సగటు లోటు 9 గా ఉంది. ప్రభుత్వ నిర్వహణ, సాధారణ సేవలు అందించడంపై వెచ్చించే సొమ్ముకు సంబంధించి రెవెన్యూ వ్యయంలో రాష్ట్రం 20 శాతం లోటును నమోదు చేసింది. ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, రుణాలపై వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, సాధారణ పరిపాలన ఖర్చులు ఉన్నాయి. సాధారణంగా ఇటువంటి వ్యయం శాశ్వత భౌతిక ఆస్తులను సృష్టించదనేది స్పష్టమవు తోంది. దేశంలోని చట్టసభల పని తీరును మరిం త స్పష్టంగా, సమాచారయుక్తంగా ప్రజా భాగ స్వా మ్యంతో కూడినదిగా మార్చడానికి ఒక స్వతంత్ర, లాభాపేక్షలేని పరిశోధనా సంస్థ అయిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీలలో ప్రవేశపెట్టిన కొత్త బిల్లులు, చట్టాలు, కేంద్రరాష్ట్ర బడ్జెట్‌లలోని ముఖ్యాం శాలను సామాన్య ప్రజ లకు కూడా సులభంగా అ ర్థ మ య్యే లా సంక్షి ప్త నివేదికల (బిల్ సారాం శాలు) రూపంలో అంది స్తుంది ఇందులో భాగం గా పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ స్టేట్ ఆఫ్ ఫైనాన్సెస్ రిపోర్ట్ 2026-27 ప్రకారం రెవెన్యూ వ్యయం లో తెలంగాణ లోటు దేశంలోనే అత్య ధికంగా ఉందని స్పష్టం చేసింది. రాష్ట్రాల వారీగా సగటు లోటు 7 శాతంగా ఉండగా, ఇది సాధారణ ప్రభుత్వ కార్యకలాపాలపై తెలంగాణ ప్రభుత్వం తన ప్రణాళికాబద్ధమైన వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకుందనేదాన్ని సూచిస్తుంది. అయితే, రోడ్లు, వంతెనలు, ప్రభుత్వ భవనాలు, నీటి పారు దల ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాల వంటి దీర్ఘకాలిక ఆస్తుల కల్పనపై చేసే వ్యయాన్ని సూచించే మూలధన వ్యయం విషయంలో తెలం గాణ చాలా మెరుగ్గా రాణిం చింది. రాష్ట్రాల వ్యాప్తంగా సగటున 17శాతం లోటు ఉండగా, తెలంగాణ రాష్ట్ర మూలధన వ్యయం బడ్జెట్ అంచ నాలకంటే కేవలం 2 మాత్రమే తక్కువగా ఉంది. తెలంగాణ వ్యయ లోటు భౌతిక ఆస్తుల కల్పన కంటే ఎక్కువగా సాధారణ ఖర్చు ల్లోనే కేంద్రీకృ తమై ఉంది. రాష్ట్రం సాధారణ ఖర్చుల కోసం బడ్జెట్లో కేటా యించిన నిధులను పూర్తిగా వినియో గించుకోలేక పోయినప్పటికీ, మూలధన వ్యయం మాత్రం ప్రణాళికాబద్ధస్థాయికి దగ్గరగా ఉంది. ఆదాయ వసూళ్లలో లోటు, అప్పులపై ఆంక్షలతో కలిసి, వ్యయ నిబద్ధతలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతను ఇచ్చిందనేది లెజిస్లేటివ్ ఫైనాన్స్ నివేదిక వెల్లడించింది.



తిరుప్పనకుండ్రం కొండపై కార్తిక దీపం

సుప్రీంకోర్టు తాత్కాలిక అనుమతి

న్యూఢిల్లీ, నవంబరు 20: తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కార్తీక దీపం వివాదంపై సుప్రీం కోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు ఆదేశాలు జారీ చేసిం ది. నవంబరు 24న (పౌర్ణమి రోజున) కొండపై కార్తీక దీపాన్ని వెలిగించేందుకు అనుమతి ఇచ్చింది. మధురైలోని పవిత్ర పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందిన తిరుప్పరంకుండ్రం కొండపై నెలకొన్న కార్తీక దీపం వివాదంపై సుదీర్ఘ విచారణ చేపట్టింది. అయితే పౌర్ణమి రోజున కొండపై ఉన్న వివాదాస్పద ఖిదీపథూన్‌ఖి (రాతి స్తంభం) వద్ద కార్తీక దీపాన్ని వెలిగించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. అయితే ఈ ఒక్కసారికి మాత్రమే ఇది పరిమితమని స్పష్టం చేసింది. అయితే, ఈ కార్యక్రమాన్ని కేవలం అధికారిక ఆలయ బృందం, ప్రభుత్వ అధికారులకు మాత్రమే పరిమితం చేసింది. ఈ స్థల యాజమాన్యం, మతపరమైన ఆచారాలకు సంబంధించిన ప్రధాన వివాదంపై తుది విచారణను పెండింగ్‌లో ఉంచింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ అనుమతిని కేవలం ఒక్కసారికి మాత్రమే ఇచ్చే తాత్కాలిక ఏర్పాటుగా స్పష్టం చేసింది. ఈ అంశంపై గతంలో మద్రాస్ హైకోర్టు తీర్పునకు ఆమోదంగా గానీ, లేదా అక్కడ ఒక స్థి

వార్త

దూరదృష్టి లేని వ్యక్తి ఉన్నతాశయాలు సాధించలేడు. గొప్ప పనులు చేపట్టలేడు.

న- ఉద్రోవిల్సన్

కొత్త 'శాంతి' మంత్రం!

ఒకపక్క యుద్ధం కోసం ఉవ్విళ్లూరుతూనే శాంతి ప్రవచనాలు వల్లించే వారొకరు మరోపక్క తన పని తాను వ్యూహాత్మకంగా చేసుకుపోతూ కనీసం సరిహద్దు దేశాల వాళ్లు ఉంటారు. వారి మనోగతమేంటో తెలుసుకోకుండానే తమ దేశాభివృద్ధి కోసం ఆత్మరక్షణ కవచాన్ని నిర్మించుకునే వారింకొకరు. మరోచోట తన పాత దాయాది ప్రాంతాలపై కన్నేసి వాటినెలాగైనా సొంతం చేసుకోవాలని తమ దేశాన్ని 'క్రీమీ' దేశంగా మార్చుకోవాలనే సుదీర్ఘకాలపు యుద్ధతంత్రంతో చొచ్చుకుపోవాలని ప్రయత్నించే మరో దేశాధినేత ఇంకోపక్క.ఈ ముగ్గురూ తాజాగా శాంతిమంత్రాన్ని పఠించడం సామాన్యులకెవరికైనా విస్మయం గొలుపకమానదు. ప్రపంచ రాజకీయాల్లో అమెరికా, రష్యా, చైనా ఈ మూడు అగ్రరాజ్యాధినేతలు డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్, షీ జిన్‌పింగ్‌ల మధ్య ఎప్పుడూ ఆధిపత్యపోరు, భిన్న ధృవాలైఖరి కనపడుతూనే ఉంది. మారుతున్న భౌగోళిక, రాజకీయ ఆర్థిక పరిస్థితుల రీత్యా ఈ మువ్వురూ ఒకేసారి ఓ శాంతి శాంతి: అనే పదాలు ఉచ్చరిస్తున్నారంటే దాని వెనుక ఎన్నో బలమైన వ్యూహాలు దాగి ఉన్నట్లు విశ్లేషకులు వివరించే విషయం. ప్రపంచ వేదికపై ఎప్పుడూ కత్తులు దూసుకునేందుకైనా వెనుకాడని మూడు భిన్న ధృవాలు వాషింగ్టన్, మాస్కో, బీజింగ్‌లు తమ ప్రయోజనాలు తాము కాపాడుకోవాలనే తపనలో ఉంటాయి. వారి లెక్కలు వారివి.వ్యూహాత్మక స్థిరత్వం,అంతర్జాతీయ భద్రతను కాపాడుకోవడం ఐక్యరాజ్యసమితిని సంస్కరించే ప్రయత్నాన్ని కూడా వారు ఉమ్మడి ప్రయత్నంగా చేపట్టబోతున్నారు. తాజాగా షెన్‌జెన్‌లో జరిగిన తొలి త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశం అనంతరం వారు ముగ్గురూ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు.'అణు యుద్ధానికి నో' అనే ఏకవాక్య నిర్ణయంపై గట్టిగా ఉన్నామనిపిస్తూనే అణ్వాయుధాల నియంత్రణపై నోరు మెదపలేదు. నిజానికి పశ్చిమాసియా యుద్ధ పరిణామాలను జీర్ణించుకోలేని ట్రంప్‌కు 'శాంతి'ఒప్పందం తప్పనిసరి. లేకుంటే అమెరికా బండారం బయటపడిపోతుంది. ఇంటా బయటా విమర్శలనెదుర్కొంటున్న అగ్రదేశాధినేత ట్రంప్ ఒక్క రోజులో యుద్ధాన్ని ఆపేయగలననే ధోరణిలో మాట్లాడుతున్నా ఆ పని చేయలేకపోతున్నారు. 'మా కొద్దీ యుద్ధం, మన కొద్దీ శాంతి' అనే ధోరణిలోకి వచ్చేశారు. కంటినీటి తుడుపు చర్యగా ఇతర అగ్రదేశాధినేతలు పిలుపుకు వంతపాడక తప్పడం లేదు. అమెరికాకు ఉన్నట్టుండి ఆర్థికభారం తగ్గించాలనే తపనే ఆయన్ని కొత్తదారిలోకి నడిపిస్తోందనుకోవాలి.అణ్వాయుధాలు లేని ప్రపంచాన్ని నిర్మించాలని జిన్‌పింగ్ పిలుపులో 'శాంతి' పరిణామాలను ఆహ్వానిస్తున్నట్లుగానే ఉంది. అంతర్జాతీయ శాంతిని కాపాడటంలో మూడు అగ్రదేశాలకు బాధ్యత ఉందంటూ పుతిన్ ఆలోచన బయటపడింది. తాము ఉక్రెయిన్ నుంచి స్వాధీనపరుచుకున్న ప్రాంతాలపై తమ హక్కును వదులుకోకుండా షరతులకు లోబడే శాంతినే ఆయన కోరుకుంటున్నారు. ప్రపంచానికి ఎదురౌతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కోవడానికి ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు తీసుకురావాలన్న అంశంలో ఆ ముగ్గురిదీ ఒకటే మాట.అణుయుద్ధంలో ఎవరూ గెలువలేరు కనుక అలాంటి ప్రయత్నాలు ప్రపంచానికి మంచిది కాదని అణుప్రమాదాలను తగ్గించడం, అణ్వాయుధాల వ్యాప్తిని నిరోధించడంపై ఉమ్మడి కార్యాచరణకు సిద్ధమని ప్రకటించారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ దృష్టి ప్రపంచ ఆర్థికశక్తిగా ఎద గాలన్న ఆలోచనలో ఉన్నట్లు ద్యోతకమవుతుంది. ఇంధన సహకారంపై అన్ని దేశాల ప్రయోజనాల రీత్యా శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులు సరఫరాను పెంచుకునే విషయంలో మూడు దేశాలు ఒకే మాటమీదకొచ్చాయి. ప్రపంచవ్యాప్త సరఫరా గొలుసును యుద్ధకాంక్ష దెబ్బతీ స్తుంది. పైగా ఇదే జరిగితే ప్రధానంగా చైనా ఎగుమతు లకు నష్టం కలిగిస్తుందనే అంచనాతోనే చైనా ఈవిషయం లో ముందడుగు వేసింది. ప్రపంచ స్థిరత్వం ఉంటేనే చైనా వ్యాపారం 'బెల్ట్ అండ్ రోడ్' ప్రాజెక్టులు సజావుగా సాగుతాయి. ఈ నేపథ్యమే 'శాంతి మంత్రం' పఠించేలా చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఆర్థిక మందగమనం ప్రభావం అగ్రరాజ్యాల మీద కూడా పడింది. అందుకే అగ్రరాజ్యమనబడే అమెరికా 'రేపటి యుద్ధాలకు ముకుతాడు' వేసే దిశగానే పయనిస్తోంది. 'శాంతి కోసం ఏ అగ్రదేశపు నేతా తమ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టరన్న విషయం ప్రపంచానికెరుకే. అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు, విదేశాంగ వ్యవహారాల నిపుణుల అంచనాల మేరకు ఈ ఒప్పంద 'శాంతి' ప్రవచనం గాలిలో దీపమైవెలుగొందే పరిస్థితి తలెత్తినా ఆశ్చర్య పోనక్కర్లేదు. సాంప్రదాయ దౌత్య ఒప్పందాల కంటే భిన్నంగా కేవలం ఆముదు అగ్రదేశాల మధ్యవ్యూహాత్మక ఆర్థికప్రయోజనాల చుట్టూనే పరిభ్రమించే పరిస్థితి కనబడుతోంది. దీర్ఘకాలిక పరిష్కారాలు కంటే యుద్ధకాంక్ష ఎవరిలో ఉన్నా వారు బేషరతుగా 'శాంతి' ఒప్పంద పరిష్కారంలో చేరడం అత్యంత అవశ్యకం. ఒకరి 'సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను మరొకరు గౌరవించుకోవాలి' అంతేకాదు ఒకరి రెడ్‌లైన్‌లను మరొకరు సవాల్ చేయకూడదు'. అని చైనా అధ్యక్షుని మాటల్లోఅంతరార్థం గమనిస్తే 'శాంతి' ప్రవచనాలు లోగుట్టు తమ ముగ్గురిలో 'ఒకరి జోలికి మరొకరు రాకూడదు' అనే మాట అనిపిస్తోంది. ఈరీత్యా ఉక్రెయిన్, ఇరాన్‌లతో రష్యా, అమెరికాల యుద్ధ విరమణ ఎలా ఉండబోతుందనే విషయంలో వారు పునరాలోచించుకునే అవకాశం ఏర్పడింది. ఎవరు తగ్గాలి, ఎవరు నెగ్గాలి అనే సందర్భంలో వీరి ప్రవచనాలకు ఎంతబలం ఉందో ఎవరూ చెప్పలేం.

వ్యాపారంగా మారుతున్న భిక్షాటన

విధి వంచనకు గురై అంగవికలురై మరే పనిచేయలేక, పొట్టగడవక, నా అనేవారు లేక, మరో గత్యంతరం లేక భిక్షాటనవైపు మొగ్గుచూపుతున్నవారి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సానుభూతిని ప్రకటించవచ్చు. వారికి అంతో, ఇంతో సహాయం చేయొచ్చు. అలాంటివారికి చేయూతనివ్వాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. సాటిమానవులుగా చేతనైనంత సహాయం చేయడం మన విధి, ధర్మం. కానీ దాన్ని ఆసరాగా తీసుకొని కాళ్లు, చేతులు అన్నీ సక్రమంగా ఉండి పనిచేసే శక్తి ఉన్నా భిక్షాటన చేయడం ఎంతవరకు సమంజసం? దీన్ని చివరకు వ్యాపారంగా మార్చేశారు. చిన్న పిల్లలను సైతం ఈ వృత్తిలోకి దించి వారితో వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఎంతవరకు వెళ్లిందో ఊహించుకోవచ్చు. ప్రాంతాలవారీగా అడుక్కుతినే ప్రదేశాలను పంచుకుంటున్నారు. ఆయా ప్రదేశాలను తాము తప్ప మరొకరు వాడుకోకూడదని నిషేధం విధిస్తున్నారు. దీంతో భిక్షగాళ్ల గ్రూపుల మధ్య ఘర్షణలు కూడా జరుగుతున్నాయి. పోలీసు స్టేషన్ మెట్లెక్కిన సంఘటనలు కూడా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పుణ్యక్షేత్రాలతోపాటు నగరాల్లో కూడా ఈ సంఖ్య పెరిగిపోతున్నది.

దామెర్ల సాయిబాబ

ఆశ అత్యాశగామారి, దురాశగా రూపాంతరం చెందితే పరిస్థితులు అత్యంత దారుణంగా ఉంటాయి. అడ్డదారులకు అదుపు అజ్ఞా ఉండదు. భిక్షాటన కూడా అలా రూపాంతరం చెందుతున్నదేమోననిపిస్తున్నది. వాస్తవంగా ఆత్మాభిమానం కలిగిన వారెవ్వరూ చేయిచాపి పక్కవారిని యాచించడానికి ఇష్టపడరు. కానీ భారత్‌లో యాచనను వృత్తిగా మార్చుకునేవారు రానురాను పెరిగిపోతున్నారు. యాచక వృత్తి నిషేధ చట్టం 1975 నుండే అమలులోఉన్నా అమలుకు నోచుకోవడం లేదనే చెప్పొచ్చు. ఫలితంగా ఇతర రాష్ట్రాల నుంచి కూడా తెలుగు రాష్ట్రాలకు భిక్షాటనకు వచ్చే వారి సంఖ్య పెరిగిపోతున్నది. భిక్షాటనకు మించి లాభసాటిగా ఉండే వ్యాపారం మరొకటి లేదనే చెప్పొచ్చు.ఎందుకంటే పెట్టుబడి ఉండదు, నష్టాలు వచ్చే అవకాశం లేదు. సర్వకాల సర్వావస్థలయందు వృత్తి ఆగే పరిస్థితి లేదు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా దీనికి ధోకా ఉండదు. అందుకే ఈ వృత్తిలోకి దిగేవారు ఎవరైనా వదిలిరావడానికి ఏమాత్రం అంగీకరించరు. కాకపోతే ఆరంభించేటప్పుడు కొంత ఇబ్బందికరంగానే ఉంటుంది. ముఖ్యంగా ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వంటి పదాలకు చోటు ఇవ్వకుండా అవి త్యాగం చేయగలిగితే, పట్టించుకోకపోతే ఇంతకుమించిన లాభసాటి వ్యాపారం మరొకటి లేదని చెప్పొచ్చు. భిక్షాటనను నిరోధించడానికి పాలకులు ఎన్నో చర్యలు తీసుకుంటున్నారు. చట్టాలు చేస్తున్నారు. అవన్నీ నిరుపయోగం అవుతున్నాయి. ఈ వృత్తిని ఆశ్రయించేవారి సంఖ్య అంతకంతకు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. విధి వంచనకు గురై అంగవికలురై మరే పనిచేయలేక, పొట్టగడవక, నా అనేవారు లేక, మరో గత్యంతరం లేక భిక్షాటనవైపు మొగ్గుచూపుతున్నవారి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సానుభూతిని ప్రకటించవచ్చు. వారికి అంతో,ఇంతో సహాయం చేయొచ్చు. అలాంటి వారికి చేయూతనివ్వాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. సాటిమానవులుగా చేతనైనంత సహాయం చేయడం మన విధి, ధర్మం. కానీ దాన్ని ఆసరాగా తీసుకొని కాళ్లు, చేతులు అన్నీ సక్రమంగా ఉండి పనిచేసే శక్తి ఉన్నా భిక్షాటన చేయడం ఎంతవరకు సమంజసం? దీన్ని చివరకు వ్యాపారంగా మార్చేశారు. చిన్న పిల్లలను సైతం ఈ వృత్తిలోకి దించి వారితో వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఎంతవరకు వెళ్లిందో ఊహించుకోవచ్చు. ప్రాంతాలవారీగా అడుక్కుతినేప్రదేశాలను పంచుకుంటున్నారు. ఆయా ప్రదేశాలను తాము తప్ప మరొకరు వాడుకోకూడదని నిషేధం విధిస్తున్నారు. దీంతోభిక్షగాళ్ల గ్రూపుల మధ్య ఘర్షణలు కూడా జరుగుతున్నాయి. పోలీసు స్టేషన్ మెట్లెక్కిన సంఘటనలు కూడా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పుణ్యక్షేత్రాలతోపాటు నగరాల్లో కూడా ఈ సంఖ్య పెరిగిపోతున్నది. ప్రార్థనా మందిరాలు, బస్సుస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, ఒక్కచోటేమిటి అడుక్కోవడానికి వీలైన ప్రతి చోటా వీరితో నిండిపోతున్నది. పోటీపడి అడుక్కుంటున్నారు. ముఖ్యంగా చౌరస్తాల్లో (కూడలి) ట్రాఫిక్ సింగ్నల్స్ వద్ద వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముందు, వెనుక చూడకుండా వాహనాలకు ఒక్కసారిగా అడ్డుపడుతున్నారు. కదులుతున్న వాహనాల్లోకి చేతులు చాపుతున్నారు. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల పోలీసులు వీరిని బలవంతంగా పారద్రోలినప్పటికీ మరుసటి రోజు మళ్లీ అక్కడే ప్రత్యక్షమవుతున్నారు. వీరి వెనుక కొన్ని ముఠాలు పనిచేస్తున్నాయనే వార్తలు ఆవేదనే కాదు ఆందోళన కలిగిస్తున్నాయి. తీవ్ర కరవుతో అన్నానికి జరక్క అల్లాడుతున్న దేశంలోని దుర్భిక్ష ప్రాంతాలకు ఈ

ఒక్క మాట

ముఠాలు వెళ్లి అక్కడినుంచి పదేళ్లలోపు పిల్లలను తీసుకు వస్తున్నారు. వారి తల్లిదండ్రులకు అంతో ఇంతో ముట్టచెప్పి మూడునెలలు కాంట్రాక్టుగా ఈ వృత్తిలోకి దించుతున్నారు. వారికి చింపిరి బట్టలు తొడిగి, ఉదయాన్నే వ్యాన్‌లో అడుక్కునే కూడళ్లవద్దకు తీసుకువెళ్లి దింపుతున్నారు. తిరిగి సాయంత్రానికి వారిని బసకు తీసుకువెళ్లడం ఆ ముఠాల నిత్యకృత్యంగా మారింది. ఈ వ్యవహారమంతా ఆయా ప్రాంతాల స్థానికులకు తెలిసిన బహిరంగ రహస్యమే. విదేశీ ప్రముఖులు నగరాలకు వచ్చినప్పుడు వీరివల్ల ఇబ్బందులు ఎదురవుతాయని తాత్కాలికంగా దూరప్రదేశాలకు తరలిస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం ప్రభుత్వ కాలంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ హైదరాబాద్ నగరానికి వచ్చినప్పుడు ముందుజాగ్రత్త చర్యలుగా ఈ యాచకులందరినీ నగరానికి దూరంగా తరలించారు. ఆ తర్వాత బుష్ వచ్చినప్పుడు కూడా అధికారికంగా ప్రకటించకపోయినా అవే చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ఇవి తప్పడం లేదు. కానీ ప్రతిసారి ఇది పోలీసులకు తలనొప్పిగా మారుతున్నది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఈసమస్య అంతగా లేదు. కాళ్లు, చేతులు సక్రమంగాఉండి,ఆరోగ్యంగా ఉన్నా అడుక్కుతినేందుకు సంసిద్ధులైతే ఆయా గ్రామస్థులే అంగీకరించరు, ప్రోత్సహించరు. పైగా అటువంటి ప్రయత్నాలు ఎవరైనా చేస్తే నిరుత్సాహ పరచడమే కాదు గట్టిగా మందలిస్తారు. ఒకరకంగా చెప్పాలంటే సంఘబహి ష్కరణ లాంటిది చేయడానికి కూడా వెనుకాడరు. అందుకే ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా గ్రామీణులు గ్రామాల్లో ప్రాణత్యాగానికైనా సిద్ధపడతారు తప్ప యాచక వృత్తి చేపట్టరు. ఇక ఈ వృత్తిద్వారా లక్షలాది రూపాయలు సంపాదించినవారున్నారు, నెలకు అరవై, డెబ్భైవేలు అద్దెలు వచ్చే భవనాలున్న భిక్షగాళ్లు ఉన్నారు. యాచనకు అలవాటుపడిన ప్రాణం మరో పని చేయడానికి ఇష్టపడదు. మంచి కుటుంబాల్లోని వారు సైతం ఆదరణ కరవై, కుటుంబ సభ్యులపై ఆగ్రహంతో ఇల్లు వదిలి వచ్చి బతుకు దుర్భరమై, తిరిగి ఇంటికి వెళ్లలేక యాచనకు అలవాటుపడి తర్వాత ఆ వృత్తిని వదిలిపెట్టలేకపోతున్నారు.కొన్ని దేవాలయాల్లో మూఢనమ్మకాలతో ఈ వృత్తిలోకి దిగుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తెలుగు రాష్ట్రాల్లోకి వచ్చేవారిసంఖ్య పెరుగుతున్నదని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఎందుకు అలా తరలి వస్తున్నారంటే ఆ రాష్ట్రాల్లో భిక్షాటన అంతగా లాభదాయకంగా లేదని, ముఖ్యంగా ఇక్కడి ప్రజల ఔదార్యం, దానగుణం ఎన్నదగినవని ఆ యాచకులే మన పోలీసు అధికారులకు ఎన్నోసార్లు చెప్పారు. పైగా కర్ణాటక, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో భిక్షాటన నిరోధక చట్టం అమలు చేస్తున్నారు. మన రాష్ట్రంలో కూడా భిక్షాటన నిరోధన చట్టం అమలులో లేదనికాదు. హైదరాబాద్‌ను యాచకరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఎన్నోసార్లు ప్రయత్నాలు జరిగాయి. 1970 నుంచే ఆ కోణంలో ప్రభుత్వం ఆలోచించింది. అనేక తర్జన భర్జనలు చేసింది. 1977లో జలగం వెంగళరావు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు భిక్షాటన నిరోధక చట్టాన్ని రూపొందించారు (ఎపి యాక్ట్ నెం. 12/77). రాష్ట్ర హైకోర్టు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకొని ఎన్నోసార్లు హెచ్చరించింది. ఈ భిక్షాటన వృత్తిని నియంత్రించేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం బహిరంగంగానే అభ్యర్థించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్రస్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేసి ప్రతి ఆరుమాసాలకు అమలు తీరును సమీక్షించాలని నిర్ణయించింది. అలాగే జిల్లాల్లో కలెక్టర్ ఛైర్మన్‌గా, జిల్లాస్థాయి సలహా సంఘాన్ని కూడా అప్పట్లో ఏర్పాటు చేశారు. కానీ అవన్నీ కాగితాలకే పరిమితమైపోయాయి. భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా ఈ సమస్య కొన్ని దేశాల్లో తీవ్రంగానే ఉంది. జర్మనీ, పోలాండ్‌లో 19వ శతాబ్దంలోనే భిక్షాటనను నిషేధిస్తూ పటిష్టమైన చట్టాలు చేసి అమలు చేస్తున్నారు. దాని అతిక్రమిస్తే ఐదేళ్ల జైలుశిక్ష విధించేలా 1927 లో చట్టాన్ని సవరించారు. ఆ మేర పోలాండ్ రాజధాని వార్సాలో 1933-39 మధ్యకాలంలో దాదాపు ఐదువేల ఎనిమిది వందల మందికిపైగా శిక్షించారు.ఆయాప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల కారణంగా తగ్గుముఖం పడుతున్నది. ఇప్పటికైనా పాలకులు కళ్లుతెరవాలి. ప్రధానంగా చిన్నపిల్లలతో ఈ వ్యాపారం చేస్తున్నవారు మరింత లాభదాయకంగా ఉండేం దుకు వారిని అంగవికలురుగా మారుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు నేరాలు పెరుగుతున్నాయి. అవసరం అనుకుంటే చట్టాన్ని మరింత పటిష్టం చేసి అమలు చేసేందుకు శ్రీకారం చుట్టాలి. అలాగే మరో దారి లేక ఈ యాచకులైన వారి సంక్షేమాన్ని కూడా పాలకులు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధి మాటున హాని తలపెడుతున్న మానవుడు!

ప్రకృతి మనిషికి ప్రసాదించిన అపురూప సంపద పంచభూతాలు! నింగి, నేల, నీరు, నిప్పు, గాలి.. వీటి సమతుల్యతే సమస్త జీవకోటికి జీవనాధారం. కానీ ఆధునిక మానవుడు అభివృద్ధి ముసుగులో ప్రకృతిపై యుద్ధం ప్రకటిస్తున్నాడు. తాను సృష్టించలేని సహజ వనరులను విచ్చలవిడిగా వినియోగిస్తూ, తిరిగి పునరుద్ధరించలేని పర్యావరణ వ్యవస్థలను విధ్వంసం చేస్తున్నాడు. ఆకాశహర్మ్యాలు, పారిశ్రామిక వాడలు, రహదారులు, వాణిజ్య సముదాయాలే అభివృద్ధికి కొలమానాలుగా భావిస్తూ స్వచ్ఛమైన గాలి, తాగునీరు, పచ్చదనం,ప్రజల ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నాడు. ప్రకృతిని జయిస్తున్నామనుకునే మనిషి చివరకు తన మనుగడకే ముప్పు తెచ్చుకుంటున్నాడు.ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ 2026 గ్లోబల్ సిటీస్ సూచీ ప్రకారం ప్రపంచంలోని వేగంగా అభివృద్ధి చెందుతున్న 100 నగరాల్లో 55 భారతీయ నగరాలున్నాయి. వీటిలో 23 నగరాలు తొలి 50 స్థానాల్లో నిలిచాయి. ఇది దేశ ఆర్థిక పురోగతికి నిదర్శనమే. అయితే ఆర్థిక వృద్ధి,మానవ జీవన ప్రమాణాలు ఒకే స్థాయిలో ఉండటం లేదన్న వాస్తవాన్ని ఇదేసూచీ వెల్లడిస్తోంది. ప్రపంచంలోని వెయ్యినగరాలపై రూపొందించిన ఈ సూచీలో హైదరాబాద్ 421వ స్థానంలోనిలిచినా, జీవన నాణ్యతలో 818వ స్థానానికి పరిమితమైంది. పర్యావరణ విభాగంలో 657వ స్థానంలో ఉంది. ఢిల్లీ మొత్తం ర్యాంకు 268 కాగా, పర్యావరణ విభాగంలో 915వ

మేకిరి దామోదర్

స్థానంలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. బెంగళూరు,ముంబై, చెన్నై నగరాల్లోనూ జీవన నాణ్యతకు సంబంధించిన సవాళ్లు కొనసాగుతున్నాయి.అభివృద్ధి అంటే కేవలం ఆకాశహర్మ్యాలు, ఐటీ సంస్థలు, పారిశ్రామిక కారిడార్లు, విశాలమైన రహదారులు మాత్రమేనా? ప్రజలకు స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధం, పచ్చని ప్రదేశాలు, ప్రశాంతమైన జీవనం కల్పించడమే నిజమైన ప్రగతి కాదా? వాయు కాలుష్యం ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ విశ్లేషణ ప్రకారం భారతదేశంలో పీఎం 2.5 కాలుష్యం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా తగ్గితే సగటు భారతీయుడి ఆయుర్దాయం 3.6 సంవత్సరాలు పెరిగే అవకాశం ఉంది. అంటే అభివృద్ధి పేరుతో మనం పీల్చే గాలినే విషపూరితం చేసుకుంటున్నాం. వాహనాల పొగ, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ రంగపు దుమ్ము, శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం కాలుష్యానికి ప్రధాన కారణాలవుతున్నాయి. దేశ జీడీపీలో పట్టణ ప్రాంతాల వాటా దాదాపు 70శాతానికి చేరుతుందని ప్రపంచబ్యాంకు అంచనా వేస్తోంది. ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల కోసం పల్లెల నుంచి నగరాలకు వలసలు పెరుగుతున్నాయి.ఫలితంగా పట్టణాలువిస్తరిస్తున్నాయి.కానీజనాభా పెరుగుదలకు అనుగుణంగా మౌలిక వసతులు,మురుగునీటి పారుదల, వరద నియంత్రణ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలోపాలకులు విఫలమవుతున్నారు.కేంద్ర గృహనిర్మాణ, పట్టణవ్యవహారాల మంత్రిత్వశాఖకు సంబంధించినజాతీయ నివేదిక ప్రకారం దేశంలో 5,161 పట్టణ స్థానిక సంస్థలు పట్టణ వరదల ముప్పును ఎదుర్కొంటున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ఒకఅధ్యయనం ప్రకారం నగర విస్తీర్ణంలో 39శాతం అత్యధిక వరద ముప్పు ప్రాంతంగా, 24 శాతం ఓ మోస్తరు ముప్పుప్రాంతంగా గుర్తించబడింది.మరో 26శాతం మధ్యస్థ ముప్పుపరిధిలో ఉంది.చెరువులు,కుంటలు,నాలాలు, సహజ నీటి ప్రవాహమార్గాలు ఆక్రమణలకు గురికావడం, కాంక్రీటు నిర్మాణాలు పెరిగిపోవడం, వర్షపు నీరుభూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గిపోవడం వరదల తీవ్రతను పెంచుతున్నాయి. హైదరాబాద్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడాఇదే సమస్య కనిపిస్తోంది. ప్రకృతి మనిషి అవసరాలను తీర్చగలదు కానీ అత్యాశనుతీర్చలేదు. పంచభూతాలను శాసించాలనుకునే అహంకారానికి ప్రకృతి వివత్తులరూపంలో సమాధానం చెబుతోంది. అభివృద్ధి పేరుతో ప్రకృతిని బలిచేస్తే చివరకు మనిషిమనుగడే బలవుతుంది. రేపటితరాలకు ఆస్తులు,అంతస్తులు మాత్రమే కాదు ఆరోగ్యకరమైన భూమి,స్వచ్ఛమైనగాలి, జీవనదులైన నీటి వనరులను అందించాల్సిన బాధ్యత నేటి పాలకులపై ఉంది.

ప్రపంచ చరిత్రలను సోషల్ మీడియా తిరగరాస్తుందా?

కదిలేది కదిలించేది, మారేది మార్పించేది,మునుముందుకు నడిపించేది పెను నిద్దర వదిలించేది కావాలోయ్ నవకవనానికి అని మహా కవి అన్నట్లు నేటి ఆధునిక సామాజిక పరిణామాల పర్యవసానాలు తదనుగుణంగా అరచేతిలో బ్రహ్మాస్త్రంలా మొబైల్స్ క్షణాల వ్యవధిలోని ఎల్లలు దాటి మానవ మెదడులను నేటి సోషల్ మీడియా కుదిపి లేపుతోందనటంలో ఏమాత్రం సందేహం లేదు.వినోద విజ్ఞాన పర్యావరణ విషయాలతో పాటు సామాజిక,ఆర్థిక, రాజకీయ విషయాల విశ్లేషణల సమాచారాలు క్షణాల కాలంలో ఎల్లలు దాటి అనేకానేక సామాజిక మార్పులకు మూలకాలుగామారుతున్నాయనేది వర్తమాన వాస్తవ చిత్రం! ముఖ్యంగా ఈనాటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తమదైన నైపుణ్య శైలితో అందిపుచ్చుకుంటూ ముఖ్యంగా నేటి యువతరం రాకెట్‌ను మించిన వేగంతో తాము అనుకున్న సమాచారాన్ని క్షణాల వ్యవధిలో ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేస్తున్నదనేది ఒక వాస్తవం! గతం కంటే భిన్నంగా సాంప్రదాయ మీడియాల (ప్రింట్, ఎలక్ట్రానిక్) కంటే వేగంగా నేటి సోషల్ మీడియా విస్తృతి, పరిధి వేగం పెరగటమే కాకుండా క్షణం క్షణం ప్రతిక్షణం ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజల ఆలోచనలలో అవగాహనలో ఒక బలమైన గొంతుకతో వేగవంతమైన మార్పులకు ముందడుగులో ఉన్నదనేది అక్షర సత్యం! నేటి సామాజిక ప్రపంచంలో జరుగుతున్న అనేకానేక సమస్యాత్మక విషయాలలో ముఖ్యంగా యువతరానికి(జెంజి) సంబంధించిన సమస్యలను ప్రభుత్వాలు జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనాఉన్నది.యువతలో పేరుకుపోతున్న నిరాశ నిస్పృహలు అసహనాలు, ఆవేశాలు కట్టడి చేయలేని స్థాయిలో దినదిన ప్రవర్తమానంగా పెరిగిపోతున్నాయి. దీనికి ముఖ్య కారణాలుగా లోప భూయిష్టతతో కూడిన విద్యావిధానాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలు, నిరుద్యోగ భృతిలతో పాటుగా మన శరీర రక్షణ వ్యవస్థ మన శరీరం మీదే దాడి చేసినట్లుగా(ఆటో ఇమ్యూనిటీ) నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ కూడా యువత ఉద్యోగ భద్రతలపై పెను

అమరనాథ్ జగర్లపూడి

సవాళ్లను విసురుతోంది. ఈ పరిణామాలు అన్నీ కూడా యువతలో భయాందోళనలను కలిగిస్తోంది. పెల్లుబుకుతున్న ఆవేశాలు,అసహనాలు,అలజడులకు ప్రధానంగా ఆయాప్రభుత్వాలలోని ఆర్థిక సంక్షోభాలు, రాజకీయ అస్థిరతలు, అనూహ్యంగా పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఆశ్రితపక్షపాతాలు (నెపోటిజం),అవినీతి, సామాజిక సాంఘిక అసమానతలు, అనూహ్యంగా పెరుగుతున్న నిరుద్యోగుల సంఖ్య, చేస్తున్న ఉద్యోగాల్లో భద్రతలు లేకపోవడం ఇవన్నీ కూడా



ముఖ్యంగా యువతలో అశాంతి అలజడులకు కారణాలుగా ఉంటున్నాయి. వీటి పర్యవసానాల వలననే అనేక ప్రభుత్వాలు సంక్షోభాలలోకి నెట్టబడుతున్నాయనేది మన కళ్ళ ముందర కనపడుతున్న వాస్తవ దృశ్యాలు. ఈ కారణాలతో ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తులు, అసహనాలు అలజడుల రూపంలో ప్రతిధ్వనించటమే కాకుండాముఖ్యంగా యువతరం(జెంజీలు) ఈ ఉద్యమాల్లో ముందు భాగంలో నిలుస్తూ తమ అసంతృప్తులను సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రపంచ దశ దిశలా వేగంగా వ్యాప్తి చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ నిరసన ధ్వనులు సంక్షోభాలు ఆసియా, యూరప్ ఉత్తర,దక్షిణ, అమెరికా దేశాలలో సైతం ప్రభుత్వాలని సంక్లిష్ట పరిస్థితులలోకి నెట్టి వేస్తున్నాయనినేది ప్రస్తుత పరిణామాలకు అద్దం పడుతోంది. గతం కంటే భిన్నంగా సమస్యాత్మక విషయాలపైన సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించే గొంతుల సంఖ్య దినదన ప్రవర్తమానంగా పెరగటమే కాదు అందులో అగ్రభాగా

గ్లోబల్ ప్రాధాన్యత కోల్పోతున్న భారత్

రాహుల్ గాంధీ ఆందోళన



చికాగో, నవంబరు 20: అంతరాజీయ రాజకీయాల్లో భారత్ క్రమంగా ప్రాధాన్యత కోల్పోతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అంతర్జాతీయ దౌత్య చర్చల్లో భారత్ సైడ్ ప్లేయర్‌గా మారిందన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం ఆగడానికి పాకిస్తాన్ చర్చలు జరుపుతుంటే భారత్ మాత్రం పక్కన ఉండిపోవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. చికాగో యూనివర్సిటీలో విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్‌కు లోతైన అవగాహన ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని విమర్శించారు. పాకిస్తాన్ మధ్యవర్తిత్వం చేస్తుంటే, భారత్‌కు అమెరికా, రష్యా, ఇరాన్‌తో సంబంధాలు ఉన్నప్పటికీ వాటిని దౌత్య పరంగా ప్రభావం చూపించడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ విదేశాంగ విధానాన్ని కూడా రాహుల్ గాంధీ విమర్శించారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి ప్రపంచ నేతలతో వ్యక్తిగత స్నేహ సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని ప్రశ్నించారు. ప్రపంచదేశాల మధ్య సంబంధాలు నేతల వ్యక్తిగత స్నేహాల ఆధారంగా నిర్ణయించబడవని, వాటిని ఆర్థిక వ్యవస్థలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రభావితం చేస్తాయన్నారు.

విడతల వారీగా పిఎఫ్ విత్‌డ్రాకు ఛాన్స్

ఖాతాలోని మొత్తంపై వడ్డీ తీసుకొనే అవకాశం : కేంద్ర ట్రస్టీల బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబర్ 19 : ప్రావిడెంట్ ఫండ్ జమచేసే ఉద్యోగులకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) శుభవార్త చెప్పింది. రిటైర్‌మెంట్ తర్వాత తమ పీఎఫ్ సొమ్మును ఒక్కసారే ఉపసంహరించుకోవాల్సిన అవసరంలేకుండా విడతలవారీగా విత్‌డ్రా చేసుకునేందుకు సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్రణాళిక (ఎస్‌డబ్ల్యూపీ)ని అమలులోకి వచ్చింది. ఈ సదుపాయం పూర్తిగా ఖాతాదారుని స్వచ్ఛందమే. మన ఖాతాలో నిల్వ ఉన్న మొత్తంపై కేవలం వడ్డీ మాత్రమే తీసుకునే సదుపాయం ఉంది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన జరిగిన కేంద్ర ట్రస్టీల బోర్డు 240వ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపింది. కొత్త విధానం ప్రకారం సభ్యులు తమ పీఎఫ్ పొదుపును క్రమం తప్పకుండా వాయిదాల్లో తీసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. అంటే మొత్తం పీఎఫ్ సొమ్మును ఒకేసారి తీసుకోకుండా నెలవారీ, త్రైమాసిక లేదా ఆరు నెలల వాయిదాల్లో పొందవచ్చు. ఖాతాలో మిగిలిన సొమ్ముపై



రాబడులు కొనసాగుతాయి. దీంతో పొదుపు మొత్తం అలాగే ఉండటంతో పాటు పదవీ విరమణ తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం అందుతుందని పేర్కొంది వాయిదాల చెల్లింపు కాలంలో సభ్యుడు మరణిస్తే, నామినీలు లేదా ఆధారపడిన వారు ఖాతాలో మిగిలిన సొమ్మును ఒకేసారి తీసుకోవచ్చు లేదా నిర్ణీత కాల వ్యవధిలో చెల్లింపులు కొనసాగించుకోవచ్చు. ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకం 2026లో సవరణలకు సీబీటీ ఆమోదం తెలిపింది. ఉద్యోగం కోల్పోయిన తర్వాత పీఎఫ్ ఉపసంహరణకు వేచిచూడాల్సిన కాలాన్ని 12 నెలల నుంచి రెండు నెలలకు తగ్గించినట్టు తెలిపింది. 2026 పీఎఫ్ పథకంలోని సవరించిన నిబంధనల ప్రకారం ఈ మార్పు చేసినట్టు పేర్కొంది. దీంతో ఉద్యోగం కోల్పోయిన అర్హులైన సభ్యులు, ఉపసంహరణ ఉద్దేశం, వర్తించే షరతులను బట్టి తమ పీఎఫ్ పొదుపును ముందుగానే పొందే అవకాశం ఉన్నది. సభ్యుడి అర్హత, ఉపసంహరణ ఉద్దేశం, పథకంలో నిర్దేశించిన పరిమితుల ఆధారంగానే అందుబాటులోఉండే మొత్తం నిర్ణయమవుతుందని తెలిపింది. పదవీవిరమణ పొందుపు ముందుగానే పూర్తిగా ఖర్చుకాకుండా చూడటమూ ఈ మార్పుల ఉద్దేశమని పేర్కొంది.

వైద్య చికిత్స కోసం..

వైద్య చికిత్స కోసం సభ్యుడు లేదా కుటుంబ సభ్యుల అర్హతగల వైద్య ఖర్చులకు నగదు తీసుకోవచ్చని ఇపిఎఫ్ఒ తెలిపింది. అర్హత గల విద్యా ఖర్చుల కోసం కొంత మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చని పేర్కొంది. సభ్యుడి లేదా కుటుంబ సభ్యుల వివాహ ఖర్చులకు పీఎఫ్ పొదుపును వినియోగించుకోవచ్చని తెలిపింది. ఇల్లు లేదా స్థలం కొనుగోలు, నివాస గృహ నిర్మాణం, గృహ రుణం చెల్లింపు, ఉన్న ఇంటి మరమ్మతుల కోసం కూడా ఉపసంహరణకు అనుమతి ఉండొచ్చని పేర్కొంది. పథకంలో పొందుపరిచిన మరికొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనూ సభ్యులు నగదు తీసుకోవడానికి అర్హులవుతారని తెలిపింది. విభాగాన్ని బట్టి తీసుకునే మొత్తం మారవచ్చని తెలిపింది.

సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు మాతృ వియోగం



లక్నో, నవంబరు 20: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇంట తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన తల్లి సావిత్రి దేవి (91) కన్ను మూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఉత్తరాఖండ్ ముఖ్య మంత్రి పుష్కర్ సింగ్ ధామి సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. యోగి ఆదిత్యనాథ్ తల్లి మృతి పట్ల ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సంతాప సందేశాన్ని పోస్ట్ చేశారు. 91 ఏళ్ల వయసులో సావిత్రి దేవి మరణించడంతో యోగి ఆదిత్యనాథ్ కుటుంబంలో విషాదం నెలకొంది. తల్లి మరణవార్తతో పలువురు రాజకీయ ప్రముఖులు, నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పూజ్య మాతృమూర్తి సావిత్రి దేవి మరణవార్త అత్యంత బాధాకరం. తల్లి ప్రేమ, ఆశీస్సులు, ఆప్యాయతలు జీవితంలో వెలకట్టలేని సంపద. ఆమె మరణం కుటుంబానికి తీరని లోటు. దివంగత ఆత్మకు భగవంతుడు తన పాదాల చెంత స్థానం కల్పించాలని, యోగి ఆదిత్యనాథ్‌తో పాటు కుటుంబ సభ్యులందరికీ ఈ అపార దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని బాబా కేదార్‌నాథ్‌ను ప్రార్థిస్తున్నానని ధామి పేర్కొన్నారు.

గగన్‌యాన్ మళ్లీ వాయిదా!

ఫిబ్రవరిలో ప్రయోగం జరగకపోవచ్చంటున్న ఇస్రో వర్గాలు

న్యూఢిల్లీ, నవంబరు 20: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ మరోసారి వాయిదా పడనుంది. ఈ మిషన్‌లో భాగంగా చేప ట్టాల్సిన తొలి మానవరహిత ప్రయోగం 2027 ఫిబ్రవరి కంటే ముందు జరిగే అవకాశం లేదని ఇస్రోలోని పలువురు సీనియర్ అధికారులు వెల్లడించారు. వాస్తవానికి ఈ ప్రయోగాన్ని 2026 డిసెంబర్‌లో నిర్వహించాలని ఇస్రో ప్రణాళికలు రచించింది. ప్రస్తుతం జరుగుతున్న సాంకేతిక మెరుగుదలలు, అదనపు సిమ్యులేషన్లు, తనిఖీ ప్రక్రియల కారణంగా ఈ ప్రయోగం ప్రస్తుత గడువు దాటి వెళ్లే అవకాశం కనిపిస్తోంది.హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్, యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లలో జరుగుతున్న పనులపై అవగాహన ఉన్న అధికారుల సమాచారం ప్రకారం ఇప్పటివరకు దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే వ్యోమ నౌక, రాకెట్‌కు తుది అనుమతులు ఇచ్చే ముందు మరికొన్ని కీలక పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. భారత మానవ సహిత అంతరిక్ష సామర్థ్యాన్ని నిరూపించే తొలి ప్రయత్నం ఇదే కావడంతో, ఎటువంటి లోపాలకు తావులేకుండా మిషన్‌ను



అత్యంత సురక్షితంగా తీర్చిదిద్దాలని ఇస్రో భావిస్తోంది. మిగిలిన సాంకేతిక అంచనాలు డిసెంబర్ ప్రయోగ షెడ్యూల్‌పై ప్రభావం చూపవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇవోఎస్05 ఉపగ్రహాన్ని మోసుకెళ్లిన జిఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవం తమైన తర్వాత ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కీలక ప్రకటన చేశారు. 2026 క్యాలెండర్ ఏడాదిలో ఈవోఎస్03తో పాటు తొలి మానవరహిత గగన్‌యాన్ ప్రయోగం సహా మరో ఆరు ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ మిషన్ కోసం ఇప్పటివరకు ఎ 8వేల పరీక్షలు పూర్తయ్యాయని, సాధారణ ఉపగ్రహ ప్రయోగాల మాదిరిగా కాకుండా ఇందులో మానవ ప్రాణాల భద్రత అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. క్రూ ఎస్కేప్ సిస్టమ్, ఎన్విరాన్‌మెంటల్ కంట్రోల్ వ్యవస్థలు తుది దశకు చేరుకున్నాయని, ఆర్బిటల్ మాడ్యూల్ అభివృద్ధి జరుగుతోందని నారాయణన్ అప్పట్లో వివరించారు. 2022 మే నాటికి భారత్ తొలి మానవసహిత అంతరిక్ష యాత్రను పూర్తి చేయాలనే లక్ష్యంతో 2019 జనవరిలో గగన్‌యాన్ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. తొలుత రెండు మానవరహిత ప్రయోగాల తర్వాత మానవ సహిత యాత్ర చేపట్టాలని భావించారు. కానీ కోవిడ్19 మహమ్మారి కారణంగా పరికరాల తయారీ మరియు సరఫరా వ్యవస్థలకు ఆటంకం కలగడంతో గడువును సవరించాల్సి వచ్చింది. ఆ తర్వాత 2024 అక్టోబర్‌లో ఈ కార్యక్రమాన్ని మూడు మిషన్ల నుండి ఎనిమిది మిషన్లకు విస్తరించారు. దీని ప్రకారం తొలి మానవ సహిత యాత్రకు ముందు మూడు మానవరహిత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉంది. గగన్‌యాన్‌లో భాగంగా చేపట్టే తొలి మానవరహిత ప్రయోగం (బి1)లో ఇస్రో రూపొందించిన అర్ధమానవ రోబోట్ వ్యోమమిత్రను అంతరిక్షంలోకి పంపనున్నారు. వ్యోమగాములు ప్రయాణించే ముందు వ్యోమనౌకలోని కీలక వ్యవస్థల పనితీరును ఇది పరీక్షిస్తుంది.

సంక్షిప్త వార్తలు

ఇరాన్‌పై 7 రోజుల వైమానిక దాడులకు ప్లాన్?



టెల్‌అవీవ్ నవంబరు 20: ఇరాన్‌తో మరోసారి యుద్ధం తప్పదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అంటున్నారు. ఇరాన్‌పై కొన్ని రోజుల పాటు సైనిక దాడులు నిర్వహించేందుకు అమెరికా మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో నెతన్యాహూ ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. ఇటీవల సీనియర్ మంత్రులు, భద్రతా అధికారులతో జరిగిన సమావేశాల్లో నెతన్యాహూ ఈ వ్యాఖ్యలు చేసినట్లు ఇజ్రాయిల్ మీడియా చెప్పింది. ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య అనివార్యమని నెతన్యాహూ చెప్పినట్లు సమాచారం. ఇజ్రాయిల్, అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు దాడులకు సంబంధించిన ప్లాన్ పంచుకున్నట్లు, ఆమోదించినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలకు చెందిన సీనియర్ అధికారి వెల్లడించినట్లు తెలుస్తోంది.

పాక్ ఐఎస్ఐ అతిథిగా దావూద్ ఇబ్రహీం



న్యూఢిల్లీ, నవంబరు 20: అండర్‌వరల్డ్ డాన్, గ్లోబల్ టెర్రరిస్ట్ దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లోనే ఉన్నాడంటూ వస్తున్న వార్తలకు బలం చేకూర్చేలా ఓ మాజీ ఎఫ్‌బీఐ ఏజెంట్ సంచలన విషయాలు వెల్లడించారు. దావూద్ నెట్‌వర్క్‌లోకి తాను చొరబడ్డానని చెప్పుకుంటున్న పాకిస్థాన్ సంతతికి చెందిన కమ్రాన్ ఫరీదీ, ఆజ్ తక్ రేడియోకు ఇచ్చిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో దావూద్ జీవితానికి సంబంధించిన అనేక ఆసక్తికరమైన అంశాలను బయటపెట్టారు. దావూద్ ఇప్పటికీ కరాచీలోని క్లిఫ్టన్ ప్రాంతంలోనే చురుగ్గా ఉన్నాడని, భారత్‌పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో తన నివాసాన్ని మార్చలేదని స్పష్టం చేశారు. దావూద్‌కు పాకిస్థాన్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ (ఎస్ఎస్జీ)కు చెందిన 35 నుంచి 45 మంది కమాండోలు ఆటోమేటిక్ ఆయుధాలతో నిరంతరం భద్రత కల్పిస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లో బిజెపిని దాటేసిన కాంగ్రెస్

జైపూర్; నవంబరు 20: రాజస్థాన్‌లో జరిగిన గ్రామ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో విపక్ష కాంగ్రెస్ పార్టీ దూసుకుపోతోంది. జిల్లా పరిషత్ లు, పంచాయతీలకు జరిగిన ఈ ఎన్నికల్లో అధికార బీజేపీని వెనక్కి నెట్టి పలు చోట్ల కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని చాటుకుంటోంది. రాష్ట్రంలోని మొత్తం 37 జిల్లా పరిషత్ లకు ఎన్నికలు జరగగా.. ఇందులో 24 చోట్ల కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంది. అలాగే 419 పంచాయతీ సమితులకు ఎన్నికలు జరగగా ఇందులో ఏకంగా 177 చోట్ల హస్తం పార్టీ తమ ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. రాజస్థాన్ గ్రామ స్థానిక సంస్థలకు తాజాగా జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇవాళ చేపట్టారు. ఇందులో బీజేపీ కంటే కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధిస్తోంది.

ట్రంప్ కార్యవర్గం అనుమతితోనే చైనాకు ఎఐ చిప్‌లు



వాషింగ్టన్, నవంబరు 20: చైనా గూఢచారితో ఎన్విడియా మాజీ సిఇఒ జెన్సన్ హువాంగ్ సన్నిహిత బంధం వ్యవహారం టెక్ ప్రపంచంలో తీవ్రదుమారం రేపింది. చైనాకు ఎఐ చిప్‌లను తరలించేందుకే ఆ మహిళ జెన్సన్‌కు దగ్గరైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ పరిణామాల వేళ తాజాగా ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ కార్యవర్గం అనుమతితో అమెరికా కంపెనీల నుంచి చైనా కు దాదాపు 9 లక్షల ఎఐ చిప్‌ల ఎగుమతి జరిగినట్లు తెలిసింది. ఈ మేరకు యుఎస్ హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ విడుదల చేసిన లైసెన్సింగ్ డేటాలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2025 డిసెంబరు నుంచి 2026 మే నెల మధ్య ఎన్విడియా, ఎఎండి సంస్థలు 8,79,000 చిప్‌లను చైనా కంపెనీలకు అందించినట్లు డేటాలో ఉంది.

ముస్లిం యువతి నికాహ్‌కు 'వందేమాతరం' అడ్డు



షాజహాన్‌పూర్, నవంబర్ 20: ఉత్తర ప్రదేశ్‌లో ఒక ముస్లిం ఇంటిపై 'వందేమాతరం', 'భగత్ సింగ్' అనే పదాలు రాసిఉండటంతో మతపెద్ద అభ్యంతరం వ్యక్తంచేశాడు. ఈ ఘటన యూపిలోని షాజహాన్‌పూర్‌లో జరిగింది. ఈ వ్యాఖ్యలు ఉండటాన్ని చూసిన ఇమాన్, ఆ ఇంట్లో నివసిస్తున్న ముస్లిం కుటుంబానికి చెందిన యువతి పెళ్లి నిర్వహించడానికి నిరాకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై న్యాయవాది మోనిష్ ఫిర్యాదు చేయడంతో ఇమామ్ మహ్మద్ సుర్ఫాన్ రజా ఖాద్రీపై ఎఫ్ఐఆర్ నమోదైంది.

కొత్త పాస్‌పోర్టు కోసం షేక్ హసీనా దరఖాస్తు



ఢాకా, నవంబరు 20: బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరో సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్ నుంచి స్వదేశానికి తిరిగి వెళ్లేం దుకు కీలక అడుగు వేశారు. తన కొత్త పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు కోసం న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ను ఆశ్రయిం చారు. తన తరఫున దరఖాస్తు చేసేందుకు బ్రిటిష్ బారిస్టర్ స్టీవెన్ పౌల్స్ కేసీకి అధికార పత్రాన్ని అందించిన హసీనా.. ఈ వ్యవహారాన్ని అత్యవ సరంగా పరిగణించి తక్షణమే స్పందించాలని కోరారు. నవంబర్ 19న న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ తాత్కాలిక హైకమిషనర్ ప్రీతి రహమ్‌కు బారిస్టర్ స్టీవెన్ పౌల్స్ ఒక లేఖ రాశారు. నవంబర్ 9న తాను పంపిన లేఖకు కొనసాగింపుగా దీనిని రాస్తున్నట్లు పేర్కొన్నా రు..దీనిని అత్యవసర వ్యవహారంగా పరిగణించాల న్నారు.తాను షేక్ హసీనా తరఫున వ్యవహరిస్తున్నట్లు హైకమిషన్ ఆధారాలు కోరిందని, అందువల్ల నవంబర్ 9వ తేదీతో ఆమె స్వయంగా సంతకం చేసిన అధికార పత్రాన్ని ఈ లేఖకు జతపరుస్తున్నట్లు స్టీవెన్ పౌల్స్ స్పష్టం చేశారు. కొత్త పాస్‌పోర్ట్, ఎన్ఐసీ కోసం న్యూ ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు దరఖాస్తు చేసుకునే పూర్తి అధికారాన్ని తన న్యాయ ప్రతినిధి స్టీవెన్ పౌల్స్ కేసీకి ఇస్తున్నట్లు హసీనా పేర్కొన్నారు.

రష్యా అధినేత పుతిన్‌పై చిన్నచూపు

ట్రంప్‌ను మంచి చేసుకునే పనిలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్



బీజింగ్, నవంబరు 20: 'అయిన వారికి ఆకుల్లో పెట్టి.. కాని వారికి కంచాల్లో' అన్న సామెత రష్యా అధినేత పుతిన్‌కు చైనాలో అనుభవంలోకి వచ్చిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. చైనాతో సన్నిహితంగా ఉండే రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను పట్టించుకోకుండా.. నిత్యం చైనాను విమర్శించే డొనాల్డ్ ట్రంప్‌ను మంచి చేసుకునే యత్నం జిన్‌పింగ్ చేసినట్లు వీటిల్లో పేర్కొన్నారు. షెన్‌జెన్ పర్యటనలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పోలిస్తే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చైనాలో తక్కువ ప్రాధాన్యం లభించినట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడిని ఆహ్వానించేందుకు స్వయంగా తానే వెళ్లిన జిన్‌పింగ్.. రష్యా అధ్యక్షుడి కోసం మాత్రం కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరోలో 5వ ర్యాంక్‌లో ఉన్న కైక్విని పంపించారు. ఆయన ఎత్తు 6.1 అడుగులు కాగా.. పుతిన్ 5.7 అడుగుల వరకు ఉంటారు. పరస్పరం అభివాదం చేసుకునే సమయంలో రష్యా అధినేత ఆహ్వాన్ని రెచ్చగొట్టడానికే చైనా ఇలా చేసిందని అమెరికా మీడి యాలో కథనాలు వెలువడ్డాయి.

ఆ తర్వాత కూడా పుతిన్ బుధవారం రాత్రి విందులో కలిసినప్పుడు కూడా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హడావుడిగా మాట్లాడి వెళ్లారు. అదే అమెరికా అధ్యక్షుడితో సుదీర్ఘ సమయం మాట్లాడుతూ అంతర్జాతీయ మీడియా ఎదుట పోజులిచ్చారు. ఇక అమెరికా అధ్యక్షుడు వచ్చిన వేళ ఆ దేశ జాతీయ గీతం పాడగా.. పుతిన్ వచ్చిన వేళ రష్యా సంగీత దర్శకుడు కంపోజ్ చేసిన 'ది నట్ క్రాకర్'లోని మ్యూజిక్ వినిపించారు. గ్రూప్ ఫొటో వేళ కూడా పుతిన్ ఎక్కడ నిలబడాలో ట్రంప్, జిన్‌పింగ్ సూచించడం గమనార్హం. ఇక గ్రూప్ ఫొటోకు ముందు కూడా పుతిన్‌కు జిన్‌పింగ్ షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు.

ఇక నవంబరు 18న ఎజిఇసి సమావేశం సందర్భంగా జరిగిన విందులో ట్రంప్-జిన్‌పింగ్ ఓ టేబుల్ వద్ద కూర్చోగా.. పుతిన్‌కు మరో టేబుల్ కేటాయించారు. ఈ విషయాన్ని రష్యా అధ్యక్షుడి సలహాదారు యూరి ఉషికోవ్ ధ్రువీకరించారు. అయితే, కారణాలు మాత్రం ఆయన వెల్లడించలేదు. ఈ మొత్తం వ్యవహారంలో పుతిన్ స్థాయిని తగ్గించాలనే ఉద్దేశంతో కాకుండా.. ట్రంప్‌కు దగ్గరయ్యేం దుకు చైనా యత్నాలు కొనసాగినట్లు యూరేషి యా గ్రూప్ విశ్లేషకుడు డోమినిక్ చియూ అభిప్రాయపడ్డారు.

---

30 యేళ్ల పోరాటం.. ఎట్టకేలకు ఫలితం!

రూ.25 వేల వివాదానికి తెర : భూమి దక్కించుకున్న మహిళ



లాతూర్; నవంబరు 20: సొంత భూమి కోసం ఓ మహిళ 30 ఏళ్ల పాటు చేసిన సుదీర్ఘ పోరాటం ఫలించింది. మూడు దశాబ్దాల కిందట తీసుకున్న రూ.25వేల రుణానికి సంబంధించిన ఈ వివాదాన్ని పరిష్కరించిన జిల్లా అధికారులు.. ఆమెకు చెందిన నాలుగున్నర ఎకరాల భూమిని తిరిగి అప్పగించారు. వివరాల్లోకి వెళితే మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా కల్‌కుటి గ్రామానికి చెందిన ముండుబాయి దావ్రే తన కుమార్తె పెళ్లి కోసం 1995లో ఓ ప్రైవేటు రుణదాత వద్ద రూ.25వేలు అప్పుగా తీసుకు న్నారు. ఇందుకోసం తన నాలుగున్నర ఎకరాల భూమిని తనఖా పెట్టారు. ఆర్థిక సమస్యల కారణంగా ఆ రుణం తీర్చడంలో ఆమె ఆలస్యం చేశారు. ఇదే అదనుగా భావించిన ఆ రుణదాత భూమిని కాజేసేందుకు కుట్ర చేశారు. కొన్నేళ్ల తర్వాత ఆ అప్పు వడ్డీతో కలిపి రూ.2.5లక్షలు కావడంతో ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు ముండుబాయి రుణదాత వద్దకు వెళ్లారు. డబ్బు తీసుకుని తన భూమిని తిరిగి ఇవ్వాలని కోరారు. తీసుకున్న అప్పువడ్డీ కలిపి రూ.10లక్షలు అయ్యిందని, ఆ మొత్తం చెల్లించాలని రుణదాత డిమాండ్ చేశారు. అప్పటికే నకిలీ పత్రాలతో ఆ భూమిని తనపేరు మీదకు బదలాయించు కున్నారు. అలా దాదాపు 30 ఏళ్లు గడిచిపోయింది. తాజాగా కుటుంబ సభ్యులు ఆర్థికంగా అండగా నిలవడంతో ముండుబాయి లతూర్ జిల్లా అధికారులను ఆశ్రయించింది. ఈ వ్యవ హారంపై విచారణ జరిపిన కలెక్టర్ భరత్ బస్తవాడ్ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్ అనుమతితో రెవెన్యూ అధికారులు భూమి రికార్డుల్లో మార్పుల చేసి, ముండుబాయినే యజమానిగా నమోదు చేశారు. దీంతో 30 ఏళ్ల కిందట కోల్పోయి 4.5 ఎకరాల భూమి ఆమెకు తిరిగి దక్కింది. లాతూర్ జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముండుబాయికి భూమికి సంబంధించిన 7/12 (సాత్‌బారా) పత్రంతోపాటు ఇతర ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తన భూమిని ఎలాంటి డబ్బు చెల్లించకుండానే తిరిగి ఇప్పించారని ఆమె తెలిపింది.

కావేరి వివాదంలో తమిళనాడు పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ.నవంబరు 20: కావేరీ జలాల పంపిణీ వివాదంలో తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. కర్ణాటక నుంచి అదనంగా 11 టీఎంసీల నీరు విడుదల చేయాలని తమిళనాడు వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరీ నది నీటి వాటా కోసం చాలా కాలంగా గొడవ నడుస్తూనే ఉంది. నీటిలో ఎవరికి ఎంత భాగం దక్కాలి, దాన్ని ఎలా వాడుకోవాలి అన్నదానిపై ఎప్పటికప్పుడు రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు వస్తూనే ఉంటాయి. నీటి కొరత వల్ల తమ రాష్ట్రంలో రైతులు ఇబ్బంది పడుతున్నారని, పంటలు దెబ్బతింటున్నాయని తమిళనాడు ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. నీటి పరిమాణాన్ని కొలవడానికి వాడే టీఎంసీ యూనిట్‌లో అదనంగా 11 టీఎంసీ నీరు ఇప్పించాలని కోరింది. కోర్టులో తమ వాదన వినిపిస్తూ, రాష్ట్రంలో నీటి కొరత తీవ్రంగా ఉందని తమిళనాడు చెప్పింది. నీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, పంటలకు నష్టం జరుగుతోందని, అందుకే అదనపు నీరు అవసరమని స్పష్టం చేసింది. అయితే సుప్రీం కోర్టు ఈ విజ్ఞప్తిని అంగీకరించలేదు. తమిళనాడు పిటిషన్‌ను తిరస్కరిస్తూ, అదనంగా నీరు వదలాలని కర్ణాటకకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వడానికి నిరాకరించింది. ఏదైతే ఉపశమనం కోసం తమిళనాడు కోర్టు తలుపు తట్టిందో, అది ఇప్పుడు దక్కకుండా పోయింది. ఈ తాజా తీర్పుతో తమిళనాడుకు అదనపు నీటి విషయంలో తక్షణ సహాయం ఏమీ దొరకనట్టయింది. నీటి కొరత సమస్యపై కోర్టు నుంచి డైరెక్ట్‌గా ఎలాంటి మద్దతు రాలేదు. ఈ తీర్పు తర్వాత కూడా కావేరీ నీటి కోసం ఇరు రాష్ట్రాల మధ్య సాగుతున్న లాబీయింగ్, చర్చలు వార్తల్లో నిలుస్తూనే ఉన్నాయి.



మాకు తాగడానికే లేవు : కర్ణాటక సీఎం డికె

కర్ణాటక నుంచి కావేరి జలాలను విడుదల చేయాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం వేసిన పిటిషన్లను సుప్రీం కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. రాష్ట్రంలో తగినన్ని నీటి నిల్వలు ఉంటే కావేరి జలాలను తమిళనాడుకు విడుదల చేసే వాళ్లమని చెప్పారు. మా దగ్గర నీళ్లు ఉంటే తమిళనాడుకు తప్పకుండా ఇస్తాం. మాకు తాగడానికి కూడా నీళ్లు లేవు. నేను రాష్ట్రాన్ని కాపాడుకోవాలి. నీటి లభ్యత గురించి రైతులను ముందే హెచ్చరించా. తమిళనాడు వేసిన పిటిషన్లను న్యాయ స్థానం కొట్టివేసింది.

వాస్తవ పరిస్థితులేంటో మనకు, ఆ రాష్ట్రానికి, ప్రతి ఒక్కరికీ తెలుసు అని డీకే శివకుమార్ పేర్కొన్నారు. నీటి ఎద్దడి కారణంగా కావేరికి ఆనవాయితీగా చేసే బాగిన సమర్పణను కూడా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.నదులు, జలాశయాలు నిండుగా ఉన్నప్పుడు కర్ణాటకలో ఈ సంప్రద

విద్యల రేడుకు శత వసంతాలు

చుక్కా రామయ్య పుట్టిన రోజు విద్యారంగానికి పర్వదినం : సిఎం రేవంత్

ఇంటికి వెళ్లి శుభాకాంక్షలందించి సత్కరించిన సిఎం

రామయ్యకు స్వయంగా శుభాకాంక్షలు తెలిపిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, హరీశ్‌రావు, విహెచ్, పలువురు నేతలు, విద్యార్థులు



శుక్రవారం చుక్కా రామయ్య నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

హైదరాబాద్ (చిక్కడపల్లి) నవంబరు 20, ప్రభాతవార్త : ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య శత జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుక్రవారం విద్యానగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. విద్యారంగానికి చుక్కా రామయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన జన్మదినం తెలంగాణ ప్రజలకు, విద్యా రంగానికి గొప్ప పర్వదినమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు ప్రజల పక్షాన నిలిచి క్రియాశీలకంగా పనిచేసిన గొప్ప సామాజికవేత్తగా ఆయన సేవలను గుర్తుచేశారు. ఐఐటీ విద్యను సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తెలుగు విద్యార్థులకు చేరువ చేయడంలో రామయ్య విశేష కృషి చేశారని సిఎం ప్రశంసించారు. విద్యావేత్తగా, శాసన మండలి సభ్యుడిగా ప్రజా సమస్యలపై ఆయన తనదైన ముద్ర వేశారని తెలి పారు. చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి ప్రముఖులతో కలిసి శాసనమండలిలో పనిచేసిన అనుభవం తనకు ఎంతో ప్రత్యేకమని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురావడంతోపాటు వాటి పరిష్కారానికి విలువైన సూచనలు చేసేవారని చెప్పారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో డిగ్రీ కళాశాల ఏర్పాటు అంశాన్ని రామయ్య శాసనమండలిలో ప్రస్తావించిన అనంతరం ప్రభుత్వం స్పందించి నిర్ణయం తీసుకుందని వివరించారు. కాలానికి, రాజకీయాలకు అతీతమైన వ్యక్తి త్వం ఆయనదని, రామయ్య ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో జీవిస్తూ విద్యార్థులకు, సమాజానికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షి ంచారు. కాగా, సుమారు వందమంది విద్యార్థులు సైతం రామయ్య నివాసానికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతా రాములు, అంబర్‌పేట కాంగ్రెస్ ఇన్‌ఛార్జి డాక్టర్ రోహిన్ రెడ్డి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

చుక్కా రామయ్యకు కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు

ప్రముఖ విద్యావేత్త, ఐఐటీ రామయ్యగా ప్రసిద్ధి చెందిన చుక్కా రామయ్య పుట్టినరోజు సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామయ్యను ఆత్మీయంగా పలకరించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. విద్యను అందరికీ చేరువ చేయ డంతోపాటు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆయన సేవలు ప్రశంసనీయమని కిషన్‌రెడ్డి కొనియాడారు. విద్యారంగానికి, సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. చుక్కా రామయ్య ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షి ం చారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్‌రావు, మాజీ కార్పొరేటర్ వై.అమృత తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన హరీశ్‌రావు

ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య జన్మదినం సందర్భంగా మాజీమంత్రి, బిఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు ఆయనకు శుభా కాంక్షలు తెలిపారు. విద్యానగర్‌లోని రామయ్య నివాసానికి వెళ్లిన హరీశ్‌రావు.. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థుల ఐఐటీ కలలను సాకారం చేసి, దేశానికి ఎందరో ఇంజినీర్లను అందించిన మహానుభావుడు చుక్కా రామయ్య అని కొనియాడారు. 'ఐఐటీ అంటే రామయ్య.. రామయ్య అంటే ఐఐటీ' అనేంతగా విద్యా రంగానికి ఆయన విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు.

చదువుల చిరునామా చుక్కా రామయ్యకు వి.హనుమంతరావు శుభాకాంక్షలు

ప్రముఖ విద్యావేత్త, చదువుల చుక్కాని చుక్కా రామయ్య శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమ సలహాదారు వి. హనుమంతరావు ఆయనకు ఘనంగా జన్మదిన శుభా కాంక్షలు తెలియజేశారు. ఆయన నివాసానికి వెళ్లి చుక్కా రామయ్యను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. విద్యారంగ అభివృద్ధికి, ముఖ్యంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడంలో చుక్కా రామయ్య చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు.

పత్తి ధరలు కౌంట్‌డౌన్

దోబూచులాడుతున్న రేట్లు

రోజుకు రూ.100-రూ.200 తగ్గింపు

హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రారంభంలో రైతులను మురిపించిన పత్తి ధర ఇప్పుడు రోజురోజుకు తగ్గిపోతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి ఏరడం ముమ్మరం కావడంతో రైతులు మార్కెట్లకు జోరుగా పంటను తీసుకొస్తున్నారు. దీంతో వ్యాపారులు దోబూచులాడుతూ రోజుకు 100 నుంచి 200 రూపాయల చొప్పున ధర తగ్గిస్తూన్నారు. మరోపక్క కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అధికారికంగా కొనుగోలు కేంద్రాలను తెరవకుండా చోద్యం చూస్తోందనే విమర్శలు ఉన్నాయి. మార్కెట్లలో ఇటీవల క్వింటాల్‌కు రూ.9,250కు పైన పలికిన ధర తగ్గుతూ వస్తూ ప్రస్తుతం మద్దతు ధరకు దగ్గరగా వచ్చింది. మరోపక్క వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే వేలంపాటలలో మిల్లు యజమానులు ఒక నిర్దిష్ట ధరకు అంగీకరించి కొనుగోలు చేసినప్పటికీ మిల్లులకు తరలించిన తర్వాత తేమ, నాణ్యత లేదనే నెపంతో అందులో కోత పెడుతు దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 48,21,503 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. సాధారణంగా ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, చివరి రెండు తడులకు నీరు ఆశించిన విధంగా అందక పోవడంతో దిగుబడి సగానికి పడిపోయింది. ఇప్పుడు ఎకరాకు ఏడు క్వింటాళ్ళ చొప్పున దిగుబడి వస్తే అదే గొప్ప అని భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 25.85 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. జిన్నింగ్ ప్రక్రియ అనంతరం సుమారు 50.68 లక్షల బేళ్ల పత్తి లభించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ప్రారంభంలో పత్తికి మద్దతు ధర కంటే అధిక ధర రావడంతో పంట దిగుబడి తగ్గినా నష్టాల నుండి గట్టెక్కవచ్చని రైతులు భావించారు. దిగుబడి తగ్గడంతో వ్యాపారులు కొంత ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తారని ఆశించారు. ప్రారంభంలో రైతులు ఆశించిన విధంగానే ధర ఉన్నా రోజురోజుకు అది తగ్గి పోతుండడంతో ఆందోళనకు చెందుతున్నారు. మార్కెట్‌లో దిగుబడి తగ్గినపుడు ధర పెరగడం సాధారణంగా జరిగేదే. అయితే ఇప్పుడు కథ రివర్స్ అయింది. దిగుబడి తగ్గింది. దానితోపాటే వ్యాపారుల మాయా జాలం కారణంగా ధర కూడా తగ్గుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మరోపక్క తుఫాన్ హెచ్చరికలతో వర్షం కురుస్తుందేమోనన్న భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధరకు మించి కొనుగోలు చేపడుతుండడంతో పత్తి విక్రయించేందుకు తాము ఏర్పాటు చేసిన కేంద్రాలకు తీసుకురావడం లేదని సీసీఐ అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ నిమిత్తం వెబ్ సైట్ ఓపెన్ చేసి ఉంచామని అంటున్నారు. రైతులు స్లాట్ బుక్ చేసుకుంటే కొనుగోలుచేసేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

తెలంగాణ ఎస్సై ప్రిలిమినరీ పరీక్ష హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్ నవంబరు 20, ప్రభాతవార్త: పోలీసు శాఖలో ఎస్ఐ తత్సమాన పోస్టుల భర్తీకి సంబం ధించి ప్రిలిమినరీ పరీక్ష హాల్‌టికెట్లు వి డుదల య్యాయి. ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలంగాణ పోలీసు నియామక మండలి తెలి పింది. ఈ మేరకు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. నవంబరు 28 అర్ధరాత్రి 12 వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం వుందని ఆయన తెలిపారు. 275 సివిల్ ఎస్సై తత్సమాన పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ రాత పరీక్ష ఈ నెల 29 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుందని, ఈ పోస్టులకు మొత్తం 1,60,712 మంది దరఖాస్తు చేసు కున్నారని ఆయన వెల్లడించారు. రిక్రూట్‌మెంట్ పూర్తయ్యే వరకు అభ్య ర్థులు హాల్‌టికెట్లు భద్రపరచుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థులు తెలు గు, ఆంగ్ల, ఉర్దూ మీడియంలలో పరీక్ష రాయవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగా అత్యధికంగా 56.84 శాతం మంది తెలుగులో రాయడానికి ఎంచు కోగా, 43.02 శాతం మంది ఇంగ్లీష్, 0.12 శాతం మంది ఉర్దూలో రాసేందుకు మొగ్గుచూపారని ఆయన తెలిపారు.

సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 86

హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 20, ప్రభాతవార్త: మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 271వ సీఎం ప్రజావాణి కార్య క్రమంలో 86 దరఖాస్తులు అందాయి.సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్ మెంట్స్ చేసి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించారు.వాటిలో రెవెన్యూ శాఖకు 24, హోం శాఖకు 12, మున్సిపల్ శాఖకు 12, ఇతర శాఖలకు 38 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏ. సీ. పీ. ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిజామాబాద్ వన్‌టౌన్ పిఎస్‌ను తనిఖీ చేసిన బాసర జోన్-2 డిఐజి

హైదరాబాద్ నవంబరు 20, ప్రభాతవార్త: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను బాసర జోన్-2 డిఐజి నారాయణ్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆయన వెంట నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఉన్నారు. డిఐజి నారాయణనాయక్ పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగా లను క్షుణ్ణంగా పరిశీలిం చారు. స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది విధుల నిర్వ హణ తదితర అంశాలను ఆ యి ్ ం న ్ సమీక్షి ంచారు. పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి విధులు, బాధ్య తలు, ఎదురవు తున్న సమస్యలను తెలుసు కున్నారు. ఆయన మాట్లా డుతూ పోలీస్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టలు, గౌరవం మరింత పెరిగేలా అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరాలను త్వరితగతిన ఛేదించాలని,కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సమన్లు, వారెంట్ల అమలును ఎప్పటి కప్పుడు పర్యవేక్షి ంచాలని డిఐజి ఆదేశించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఎసిపి ప్రకాష్, ట్రాఫిక్ ఎసిపి మస్తాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన బాసర జోన్-2 డిఐజి నారాయణ్ నాయక్. చిత్రంలో పోలీసు కమిషనర్ సాయి చైతన్య కూడా ఉన్నారు.

గ్రామీణ రవాదారుల అభివృద్ధికి డిజిటల్ సాధనం

85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌లో ప్రదర్శన

హైదరాబాద్, నవంబరు 20,ప్రభాతవార్త: గ్రామీణ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రాధాన్యత క్రమాన్ని మరింత మెరుగుపరిచేందుకు రూపొందించిన వినూత్న డిజిటల్ నిర్ణయ సహాయక సాధనాన్ని హైదరా బాద్‌లో జరుగుతున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సమా వేశంలో ప్రదర్శించారు. ఈ సమావేశం ఈ నెల 19 నుంచి 22 వరకు నిర్వహిస్తున్నారు. 'గ్రామీణ రహదారుల అప్‌గ్రెడేషన్‌కు ప్రాధాన్యత నిర్ణ యించే నిర్ణయ సహాయక సాధనం అభివృద్ధి' శీర్షికతో ఈ పరిశోధనను మహారాష్ట్రలోని ముంబై సర్దార్ పటేల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డా. ప్రశాంత్ పి. నాగ్రాలే, పరిశోధక విద్యార్థి ప్రవీణ్‌కుమార్ ఎస్.జాట్‌రావ్ చేపట్టారు. ఈ పరిశోధనా పత్రం జర్నల్ ఆఫ్ ది ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్, 85వ సంపుటి, పార్ట్ 2 (ఏప్రిల్-జూన్ 2026)లో పేపర్ నం. 754గా ప్రచురితమైంది. పరిమిత ఆర్థిక వనరులు ఉన్నప్పుడు అభివృద్ధి కోసం పోటీపడే అనేక రహదారుల్లో ఏవాటికి ముందుగా ప్రాధాన్యత ఇవ్వాలనే గ్రామీణ మౌలిక సదుపాయాల రంగంలోని కీలక సమస్యకు ఈ అధ్యయనం పరిష్కారం చూపుతుంది. సమస్యను పరిష్కరించేందుకు పరిశోధకులు ఎస్ క్యూ లిట్ డేటాబేస్ ఆధారంగా పనిచేసే పిపి25 అనే పైథాన్ ఆధారిత నిర్ణయ సహాయక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. ఈ సాధనం డేటా సేకరణ, ధ్రువీకరణ, లెక్కలు, రహదారుల ప్రాధాన్యత క్రమ నిర్ధారణ వంటి ప్రక్రియలను ఆటోమేట్ చేస్తుంది. మొదటిది ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కార్యాచరణ మార్గదర్శకాల్లోని యుటిలిటీ వాల్యూ పద్ధతి. రెండోది నెట్‌వర్క్ పనితీరు సూచీ పద్ధతి. ఇది జనాభా, రహదారి నెట్‌వర్క్‌లో ప్రయాణ దూరం పెరుగుదల నిష్పత్తి (డిటూర్ రేషియో) వంటి ప్రాప్యతకు సంబంధించిన అంశాలను అంచనా వేస్తుంది. మహారాష్ట్రలోని థానే జిల్లాలో అంబర్‌నాథ్ బ్లాక్ పరిధిలో ఉన్న 25 గ్రామీణ రహదారి విభాగాలపై ఈ సాఫ్ట్‌వేర్‌ను పరిశోధకులు పరీక్షి ంచారు. ఈ అంచనాకు పిఎంజిఎస్‌వై భౌగోళిక సమాచార వనరులు, జిల్లా గ్రామీణ రహదారుల ప్రణాళిక, 2011 జనాభా లెక్కలు, క్షేత్రస్థాయి సర్వేలు, ఇతర ద్వితీయ సమాచార వనరులను ఉపయోగించారు. రెండు ప్రాధాన్యత నిర్ణయ పద్ధతుల మధ్య మంచి స్థాయి అనుసరణ ఉన్నట్లు ఫలితాలు వెల్లడించాయి. స్పియర్‌మన్ ర్యాంక్ సహసంబంధం 0.958గా, కెండల్ టావు 0.853గా నమోదయ్యాయి. ఆటోమేషన్ వల్ల ప్రాధాన్యత నిర్ణయ ప్రక్రియ మరింత స్థిరంగా, ఒకే విధంగా పునరావృతం చేయగలిగేలా మారుతుందని ఈ పరిశీలన సూచించింది.గ్రామీణ రహదారుల అభివృద్ధి సంస్థలు మెరుగుదల అవసరమైన రహదారులను గుర్తించడానికి, పోటీపడుతున్న ప్రాజెక్టులను పోల్చడానికి, ప్రాథమిక బడ్జెట్ ప్రాధాన్యతలను రూపొందించడానికి ఈ సాధనం ఉపయోగపడుతుంది. ఈ పరిశోధనకు సంబంధించిన ఇతర అధ్యయనాలు జోర్డాన్ జర్నల్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రచురణకు ఆమోదం పొందడంతో పాటు, అంతర్జాతీయ సదస్సుల్లో ప్రదర్శనకు కూడా ఎంపికయ్యాయి. గ్రామీణ రహదారుల అభివృద్ధి ప్రణాళికను మరింత క్రమబద్ధంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చడంలో డిజిటల్ సాంకేతికత, డేటా ఆధారిత పద్ధతులు కీలక పాత్ర పోషించగలవని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

ఉన్నతపదవుల్లో ఉన్నవారు హుందాగా ఉండాలి

'ఎక్స్' వేదికగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్,నవంబరు 20,ప్రభాతవార్త: న్నత పదవుల్లో ఉన్న ముఖ్యనేతలు హుందాగా మాట్లాడాలనీ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా హితవు చెప్పారు.'అధికారం ఉందన్న అహంకారంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజలు హర్షించరనే విషయాన్ని గ్రహించాలనీ ట్వీట్ చేశారు. అదృష్టం కొద్దీ దక్కిన అధికారంతో అవినీతికి పాల్పడి, ప్రజావసరాలను విస్మరించి దుర్మార్గపు పాలన సాగిస్తే తెలంగాణ ప్రజలు, చరిత్ర ఎన్నటికీ క్షమించదనే విషయాన్ని మరువరాదనీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేసేలా బుద్ధి, ఆత్మపరిశీలనా జ్ఞానాన్ని ముఖ్యనేతలకు ఇవ్వాలని అయ్యప్పస్వామిని వేడుకుంటున్నా' అని రాజగోపాల్‌రెడ్డి వివాదస్పాద వ్యాఖ్యలు చేసి అందరి దృష్టిని మరోమారు ఆకర్షించారు. రాష్ట్రాన్ని దొంగలకు, పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు దోచిపెట్టకండి అంటూ మంత్రులకు ఎమ్మెల్యే రిక్వెస్ట్ చేశారు. పదేళ్లలో కెసిఆర్ ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. కనీసం కాంగ్రెస్ మంత్రులైనా నిజాయితీగా పాలన చేయాలని హితవుపలికారు. అహంకారంతో మాట్లాడటం మానేసి మంచిగా పాలనచేయాలన్నారు. రాష్ట్రంలో పేరుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది. మొత్తం చంద్రబాబునాయుడు మనుషులే నడిపిస్తున్నరు. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఇదేం కాంగ్రెస్ పార్టీ? అని రాజగోపాల్‌రెడ్డి దుయ్యబట్టారు. చంద్రబాబు మనుషులకు పెత్తనం ఇవ్వొద్దు.. ఆయన చెప్పుచేతుల్లో ఈ ప్రభుత్వం పనిచేయొదు అని ఫైర్ అయ్యారు. అయ్యప్పమాల వేసుకొని చెప్తున్నా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అస్సలు బాలేదు. పద్ధతి మార్చుకోకపోతే మళ్లీ అధికారంలోకి రాదు అంటూ కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. నాలుగు గోడల మధ్య బతిమాలితే వినడం లేదని, అందుకే తమ ఆవేదనను బహిరంగంగా చెబుతున్నా ఎన్నికలప్పుడు మనమే హామీ లిచ్చినం వాటిని నెరవేర్చాలని అడగడం తప్పా? అని ప్రశ్నించారు. మూ డేండ్లు మాట్లాడలేదు.. ఇప్పుడు మాట్లాడుతున్నా.. ఇప్పటికీ మాట్లాడకుంటే అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు, ఎమ్మెల్యేలకు నష్టం జరుగుతది. నా మాటలతో వారికి న్యాయం జరిగితే చాలు. పార్టీ నాకు ఏ శిక్ష వేసినా సరే అని తేల్చిచెప్పారు. ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు అంటూ రేవంత్‌రెడ్డి అప్పులు చేస్తున్నాడని, ఇట్లా అప్పులు చేసి చేపడుతున్న ప్రాజెక్టుల టెండర్లలో పారదర్శకత ఉండదని, తక్కువ కోట్ చేసినోళ్లకు టెండర్లు రానివ్వరని, ఎక్కువ కోట్ చేసినోళ్లకు కట్టబెట్టి కమీషన్లు దండుకుంటున్నారని రాజగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.

పోలీసు శాఖ భవిష్యత్ అవసరాలకు కొత్త ప్రణాళికలు

ఉన్నతాధికారులతో డిజిపి సివి ఆనంద్ సమీక్ష

హైదరాబాద్ నవంబరు 20, ప్రభాతవార్త: రాష్ట్ర పోలీస్ శాఖలో భవిష్యత్ అవసరాలకు అను గుణంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణా ళికలు, సిబ్బంది సంక్షేమంపై డిజిపి సి.వి.ఆనంద్ శుక్రవారం ఉన్న తాధికారులతో సమీక్షిం చారు. వచ్చే నెలలో నిర్వహించనున్న పోలీస్ ర ిట్రీట్, మహిళా పోలీస్ అధికారుల సద స్సు, నూతన తెలంగాణ పోలీస్ మాన్యు వల్ రూపకల్పన పూర్తి చేసి విడుదల చేయడం, పోలీస్ బ్రాస్, పైప్ బ్యాండ్లను పునరుద్ధ రించడం వంటి అంశాలపై ఇందులో చర్చించారు. రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ నిర్వహణ, ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వ హణపైనా ఇందులో సమీ క్షి ంచారు. పోలీస్ శాఖకు సం బంధించి వార్షిక శిక్షణ క్యాలెండర్ సిద్ధం చేయడం, రెండు



శుక్రవారం అభివృద్ధి ప్రణాళికలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డిజిపి సివి ఆనంద్

వేల మంది హోంగార్డుల నియా మకానికి సంబం ధించిన నోటిఫికేషన్, ఇతర వివరాలు, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పోలీస్ శాఖకు మంజూరైన సిబ్బంది సంఖ్యను పునసమీక్షించడం వంటి అంశాలను డిజిపి ఉన్న తాధికారులతో సమీక్షించారు. రిటైర్డ్ పోలీస్ అధికారుల సంక్షేమానికి తీసు కోవాల్సిన చర్యలపైనా ఇందులో చర్చించారు. సమావేశంలో చర్చించిన ప్రతి అంశానికి సంబం ధించి అధికారులకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించ డంతో పాటు, పనుల పూర్తికి గడువులు కూడా నిర్ణయించారు. నిర్ణీత సమయంలో లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిజిపి ఆదేశి ంచారు. ఈ సమావేశంలో డిజిపి మహిళా భద్రతా విభాగం డిజి సౌమ్య మిశ్రా, పోలీసు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్, సిఐడి డిజి చారు సి న్హా, టిఎస్ఎస్‌పి అదనపు డిజి సంజయ్ కుమార్ జైన్, శాంతి భద్రతల అదనపు డిజి అకున్ సబర్వాల్, పిఅండ్‌ఎల్ ఐజి గజరావ్ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణ

గ్లోబల్ సమ్మిట్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహా

హైదరాబాద్,నవంబరు20,ప్రభాతవార్త: ఆరోగ్య రంగంలో తెలంగాణను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష ్యమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ లక్ష ్య సాధనలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, హాస్పిటళ్ల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు ఉన్న వైద్యరంగ సామర్థ్యాన్ని మరింత విస్తరించి, మెడికల్ టూరిజంలో నగరాన్ని గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ఆకాం క్షి ంచారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ హెల్త్ కేర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య రంగాల్లో వస్తున్న మార్పులు, తెలంగాణలో వైద్య సేవల విస్తరణ, మెడికల్ టూరిజం అభివృద్ధి, వైద్య విద్య, నైపుణ్యాల పెంపు తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ప్రపంచస్థాయి వైద్య నివుణులు, అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని సమన్వయం చేసుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష ్యంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌లో హెల్త్‌కేర్ రంగ ప్రతినిధులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.మెడికల్ టూరిజం అభివృద్ధికి ప్రైవేటు రంగంతోపాటు ప్రభుత్వ హాస్పిటళ్లలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. మెడికల్ టూరిజం అభివృద్ధి కోసం ఆరోగ్యశాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అంతర్జాతీయ రోగులకు అవసరమైన సేవలు, సమన్వయం, ఇతర సదుపాయాలను ఒకే వ్యవస్థ ద్వారా అందించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు సహ కారం అందిస్తామని ప్రైవేటు హాస్పిటళ్ల డాక్టర్లు తెలిపారు. జాయింట్ రీప్లేస్‌మెంట్, న్యూరో సర్జరీ, కార్డియో థొరాసిక్ సర్జరీ వంటి ప్రత్యేక వైద్య విభాగాల్లో ప్రభుత్వ సర్వీసులో కొత్తగా చేరే వ

దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ గాంధీ కుమ్మక్కు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్,నవంబరు20.ప్రభాతవార్త: విదేశీ పర్యటనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రజల ఆలోచనలు, వారి ఆకాంక్షల ను అర్థం చేసుకోవడంలో రాహుల్ విఫలమయ్యారని అన్నారు. శుక్రవారం ఆయన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి దేశ సమగ్రతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు సైతం భారత్ పురోగతిని ప్రశంసిస్తున్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మేకిన్ ఇండియా విఫలమైందంటూ రాహుల్ చేస్తున్న ఆరోపణలను కిషన్‌రెడ్డి తప్పు బట్టారు. వాస్తవాలను తెలుసుకోకుండా రాహుల్ నిరాధార విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచేలా రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. రాహుల్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలను ప్రపంచ దేశాల్లో అవమానించడం దేశంలోని 140 కోట్ల ప్రజలను అవమానించడమే అవుతుందన్నారు.

ఎస్‌టిపిలు వంద శాతం వినియోగించాల్సిందే

భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేయొద్దు : హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, నవంబర్ 20 ప్రభాతవార్త: గేటెడ్ కమ్యూనిటీల్లో ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి కేంద్రాలు వంద శాతం సామర్థంతో పనిచేసేలా చూడాలని, వాటి ద్వారా శుద్ధి చేసిన నీటిని కూడా పూర్తిస్థాయిలో పునర్వినియోగంలోకి తీసుకురావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్వాహకులను ఆదేశించారు. నీటి అవసరాల కోసం భూగర్భ జలాలపై ఆధారపడటాన్ని తగ్గించాలని సూచించారు. ఒకవైపు వాడిన నీటిని వృథాగా వదిలేస్తూ మరోవైపు బోర్ల ద్వారా భూగర్భ జలాలను తోడేయడం సరికాదన్నారు. శుద్ధి చేసిన నీటిని గార్డెనింగ్, ఇతర అవసరాలకు వినియోగించుకోవడం ద్వారా నీటి వనరులను సంరక్షించుకోవాలని కోరారు. శుక్రవారం నల్లగండ్లలోని నల్లగండ్ల చెరువు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం, సమీపంలోని ఓ గేటెడ్ కమ్యూ నిటీలో ఎస్‌టీపీ పనితీరును హైడ్రా కమిషనర్ తనిఖీ చేశారు. మురుగునీటిని సేకరించడం, శుద్ధి చేయడం, శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియో



నల్లగండ్లలో ఎస్‌టిపి పనితీరును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

గిస్తున్న విధానాన్ని పరిశీలించారు. మురుగు నీటిని శుద్ధి చేయకుండా నేరుగా మురుగు కాలువల్లోకి వదలకూడదని, తప్పనిసరిగా శుద్ధి చేసిన తర్వాతే బయటకు విడుదల చేయాలని సూచించారు. అలా చేసినప్పుడే చెరువుల్లోకి చేరే నీటి నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

నీటి నమూనాల ప్రాథమిక పరీక్షల్లో గుర్తించిన అంశాలు

గేటెడ్ కమ్యూనిటీలో ఎస్‌టీపీ ద్వారా శుద్ధి చేసిన నీటిపై నిర్వహించిన ప్రాథమిక ఆన్‌లైన్ పరీక్షల్లో కొన్ని కీలక అంశాలు హైడ్రా అధికారులు గుర్తించారు. బిఓడి (నీటిలో ఉన్న సేంద్రియ వ్యర్థ పదార్థాలను సూక్ష్మ జీవులు విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఆక్సిజన్ పరిమాణం) విలువ 25.5ఎంజిగా నమోదైంది. ఇది హైదరాబాద్‌లో అమలులో ఉన్న చట్టబద్ధమైన పరిమితి 20 ఎంజిఎల్ కంటే ఎక్కువగా ఉందని తేలింది. టర్బిడిటీ (నీటి మసకదనం) 20.81 ఎన్‌టియు (నెఫెలోమెట్రిక్ టర్బిడిటీ యూనిట్ (నీటి మసకదనాన్ని కొలిచే ప్రమాణం)గా నమోదైంది. ఈ నేపథ్యంలో ఎంబిఆర్ (మెంబ్రేన్ బయో రియాక్టర్ (పొర ఆధారిత జీవ శుద్ధి వ్యవస్థ) మెంబ్రేన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అలాగే,డివో (నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్) స్థాయి 0.66 ఎంజిలుగా నమోదైంది. తదుపరి అధికారిక విశ్లేషణ నిమిత్తం నీటి నమూనాలను సేకరించి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి పంపించడం జరిగిం ది. ప్రయోగశాల నివేదికలు అందిన తర్వాత ఎస్‌టీపీ శుద్ధి సామర్థం, పనితీరు, పర్యావ రణ నిబంధనల అమలుపై తదుపరి పరిశీలన చేపట్టనున్నారు. ప్రతి చెరువు వద్ద ఎస్‌టీపీలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ, గేటెడ్ కమ్యూ నిటీల నుంచి వెలువడే మురుగునీరు కూడా శుద్ధి కాకుండా చెరువుల్లోకి లేదా మురు గు కాలువల్లోకి చేరకుండా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. నీటి వనరుల పరిరక్షణలో భాగంగా మురుగునీటి శుద్ధి, శుద్ధిచేసిన నీటి పునర్వినియోగం, భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి గేటెడ్ కమ్యూనిటీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హైడ్రా కమిషనర్ సూచించారు.

ఎడిబి తోడ్పాటుతో పల్లె దారులకు కొత్తకళ!

హైదరాబాద్, నవంబరు 20.ప్రభాతవార్త: గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతంలో ఆసియా అభివృద్ధి బ్యాంక్ కీలక పాత్ర పోషించింది. హైదరాబాద్‌లో జరిగిన 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశంలో శుక్రవారం ఎడిబి ట్రాన్స్‌పోర్ట్ స్పెషలిస్ట్ శివరాజు దొడ్ల సమర్పించిన ప్రజెంటేషన్‌లో, మెరుగైన గ్రామీణ రహదారి అనుసంధానం, విస్తృత రహదారి రూపకల్పన, సంస్థాగత బలోపేతం గ్రామీణ సమాజాల్లో తీసుకొచ్చిన మార్పులను వివరించారు.1966లో స్థాపించిన ఎడిబి, 1986లో భారతదేశంలో తన కార్యకలాపాలను ప్రారంభించింది. గత 4దశాబ్దాల్లో దేశంలోని 24 రాష్ట్రాలు, పలు ప్రధాన జాతీయ కార్యక్ర మాల అభివృద్ధికి సుమారు 63 బిలియన్ అమె రికన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించింది. మెరుగైన గ్రామీణ రహదారుల వల్ల సుమారు 11,195 ఆవాస ప్రాంతాలకు చెందిన కోటి మందికి పైగా ప్రజలు ప్రయోజనం పొందారు. విద్య, వైద్యం, మార్కెట్లు, ఉపాధి అవకాశాలకు చేరువ మెరుగుపడటంతోపాటు స్థానిక ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు లభించింది. 2003 నుంచి ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనకు మొత్తం 2.31 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ఏడు రుణాలను అందించింది. 44,970 కి.మీ నిడివిగల గ్రామీణ రహదారులు అభివృద్ధికి ఎడిబి తోడ్పాటు లభించింది.

ఆర్టీసీలో 63 మందికి పదోన్నతులు

హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త : ఆర్టీసీలో ఉద్యోగులకు పదోన్నతలు కల్పిస్తూ సంస్థ యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలుత హైదరాబాద్ జోనల్ పరిధిలోని ఉద్యోగులకు ప్రమోషనున కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా మొత్తం 63 మంది ఉద్యోగులకు వివిధ ఉన్నత హోదాల్లో పదోన్నతులను కల్పిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో సస్థ వెల్లడించింది. ఈ పదోన్నతులు పొందినవారిలో జూనియర్ అసిస్టెంట్ (ఫైనాన్స్)-28 మంది, 23 మంది కండక్టర్లు, ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు ఆఫీసర్లు (ఆర్‌సిఎస్), జూనియర్ అసిస్టెంట్ (పర్సనల్) 27 మంది ఉన్నారు. ఈ పదోన్నతుల కోసం గత ఏడాది మే నెల 25వ తేదీన నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ రాత పరీక్షతో పాటు, అదే ఏడాది జూలై 27న నిర్వహించిన కంప్యూటర్ స్కిల్ టెస్ట్‌లో అర్హత సాధించారు. ఇక డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్)కు సంబంధించి 8 మంది పదోన్నతి పొందిన వారిలో డిపో కంట్రోలర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండి డాక్టర్ అనిల్ కుమార్ పదోన్నతులు పొందిన ఉద్యోగులకు అభినందనలు తెలియ జేస్తూ, మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి సంస్థ ప్రతిష్టను పెంపొందించడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

కొత్త బోర్‌వెల్స్ తవ్వకంపై ఆంక్షల సడలింపు

హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త: కొత్త బోర్‌వెల్స్ తవ్వకంపై ఉన్న ఆంక్షలను తెలంగాణ ప్రభుత్వం సడలించింది. ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అడుగంటి పోయిన భూగర్భ జలాలను సంరక్షించేందుకు తెలంగాణ కొత్త బోర్‌వెల్స్ తవ్వకాలను నిషేధిస్తూ నప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. కొత్తగా బోర్‌వెల్ తవ్వాలనుకునేవారు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని అందులో స్పష్టం చేసింది. తాజాగా ఇప్పుడు కొత్త బోర్‌వెల్స్ వేసుకునేందుకు అవసరమైన దరఖాస్తులను ఇక నుండి ఆన్‌లైన్‌కు మార్చింది. ఇందుకు గాను మీ సేవా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు కోరేందుకు అవకాశంకల్పించింది. దీనిప్రకారం, కార్యాలయంలో దరఖాస్తులను చేసుకునే విధానికి స్వస్తి పలుకుతూ భూగర్భ జల వనరుల శాఖ కీలక మార్పు చేసింది. కొత్తగా బోరువెల్ వేయాలనుకునే వారు అందుకు అవసరమైన అనుమతుల నిమిత్తం దరఖాస్తులను మీ సేవ ద్వారా స్వీకరిస్తారు. ఈ మేరకు తెలంగాణ భూగర్భ జల శాఖ డైరెక్టర్ కె. లక్ష్మ, జిల్లా భూగర్భ జల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆఫ్‌లైన్ దరఖాస్తులు లేదా ఇతర మార్గాల ద్వారా సమర్పించిన దరఖాస్తులు స్వీకరించబడవని తేల్చిచెప్పారు. ఈ నెల మొదట్లో, ఎల్ నినో మరియు పడిపోతున్న భూగర్భ జలమట్టాలపై ఆందోళనల నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీలో నిర్మాణం మరియు తాగునీటియేతర ప్రయోజనాల కోసం కొత్త బోర్‌వెల్‌ల తవ్వకాన్ని పరిమితం చేసింది. తదనంతరం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ కోసం జీవో 259 జారీ చేయబడింది. దీని ప్రకారం, అత్యవసర తాగునీరు మరియు తక్షణ గృహ నిర్మాణ అవసరాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను అనుమతించారు. కాగా దీనికి సంబంధించి ఒకటి రెండు రోజుల్లో లాగిన్ సౌకర్యాలు, దరఖాస్తు ఫార్మాట్‌ను ఏర్పాటు చేసిన తర్వాత మీసేవ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామని, ఒక దరఖాస్తును ప్రాసెస్ చేయడానికి కనీసం 15 రోజులు పడుతుందని ఒక అధికారి తెలిపారు.

యువ సంగీతానికి ఆకాశవాణి ప్రోత్సాహం

శ్రోతలను మంత్రముగ్ధులను చేసిన సంగీత కచేరీ



సంగీత దర్శకుడు, పద్మశ్రీ ఎంఎం.కీరవాణిని ఘనంగా సత్కరిస్తున్న వక్తలు

నాంపల్లి, నవంబరు 20 ప్రభాతవార్త: యువ సంగీత ప్రతిభకు ప్రోత్సహించి పట్టంకడుతూ వివిధ సంగీత సంప్రదాయాలను ప్రేక్షకులకు పరిచయంచేసే సదుద్దేశంతో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నంద మూరి తారక రామారావు కళావేదికలో శుక్రవారం రాత్రి ఏఐఆర్ రైజింగ్ స్టార్స్-సీజన్ 1 పేరిట యువ సంగీత కచ్చేరి వీనులవిందుగా సాగింది. ఆకాశవాణి ద్వారా దేశవ్యాప్తంగా సంగీత, సంస్కృతి, కళలను ప్రజలకు చేరువ చేస్తున్న కార్యక్రమాల పరంపరలో ఈ యువసంగీత కచ్చేరీని నిర్వహించారు. యువ కళాకారుల్లోని సంగీత ప్రతిభని వెలికితీసి వారికి ప్రోత్సాహం అందించడంతోపాటు భారతీయ శాస్త్రీయ సంగీతం, సుగమ సంగీతం, గజల్స్, జానపద సంగీతం, కర్ణాటక సంగీతం వంటి విభిన్న సంగీత ప్రక్రియలను ఒకే వేదికపై అద్భుతంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసిమ్ రహ్మాన్ సారంగి, అనీష్ భారతి తబలాలతో వాద్య సహకారం అందించగా సమితా నిఖిల్ ఘడ్వాల్ పాటిల్ హిందుస్తానీ శాస్త్రీయ సంగీతం; వాసిమ్ ఉల్‌రహ్మాన్ సారంగి, టి.కునాల్ తబలా వాద్యసహకారంతో సుగమ్ సంగీతం గజల్ విభాగంలో కార్తిక్ పన్యార్ తన సంగీత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జానపద సంగీతం ఒగ్గుకథ విభాగంలో తెలంగాణ జానపద కళా సంప్రదాయాలను ప్రతిబిం బించేలా మనోజ్‌కుమార్ దీకొండ-బృందం ప్రదర్శనతో వీక్షకులను ఉర్రూతలూగించారు.దుర్గాప్రసాద్ నాదస్వరం, మంగళి వెంకట శివుడు డోలుతో వాద్యసహకారంతో కర్ణాటక శాస్త్రీయ సంగీతం-నాదస్వరం విభాగంలో పెనుమాక సాయి కుమార్-బృందం కచేరీ అబ్బురపరిచింది.

ఒకే వేదికపైకి విభిన్న ప్రక్రియలు

సంగీతంలోని విభిన్న ప్రక్రియలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి యువ కళాకారులకు ప్రోత్సాహంకల్పించే ఈ కార్యక్రమం సంగీ తాభిమానులకు ప్రత్యేక అనుభూతిని అందించి సంగీత లోకంలో విహరింపజేసింది. ప్రము ఖ భారతీయ సంగీత దర్శకుడు, గాయకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత పద్మశ్రీ ఎంఎం. కీర వాణి ముఖ్య అతిథిగా పాల్గొని, ఆకాశవాణి క్లస్టర్ హెడ్ భానోత్ హరిసింగ్, ఎస్.రమేష్‌తో కలిసి జ్యోతిప్రజ్వలనచేసి యువ సంగీత కచ రిని ప్రారంభించి, చివరిగా ఆయా ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను సత్కరించి శుభాభినం దనలు తెలిపారు.



జిల్లాకు రూ.1,087 కోట్లు కేంద్ర ప్రోత్సాహం

హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త: రైతుల డిజిటల్ డేటాబేస్‌ను సృష్టించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడం కోసం కేంద్రం ప్రారంభించిన రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా తెలంగాణలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇందుకోసం కేంద్రం రూ.1,087 కోట్ల ప్రోత్సాహకాన్ని మంజూరు చేసిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ అధికారులు చేసిన సమన్వయ కృషి ఫలితంగా ఈ విజయం సాధ్యమైంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) మరియు ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడానికి గ్రామాలను సందర్శించి, రైతులను నేరుగా కలిశారు. లక్ష్యాన్ని సాధించడానికి అధికారులు తెల్లవారుజాము నుండే కాకుండా సెలవు దినాల్లో కూడా పనిచేశారు. రైతు రిజిస్ట్రీ, ఆధార్, భూమి రికార్డులు, వ్యవసాయ వివరాలను అనుసంధానించడం ద్వారా ప్రతి రైతుకు ఒక ప్రత్యేకమైన 11అంకెల గుర్తింపు సంఖ్యను అందిస్తుంది. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు మరియు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడంలో ఈ డిజిటల్ గుర్తింపు కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ప్రధానంగా పీఎంకిసాన్, రైతు భరోసా మరియు పంటల బీమా వంటి పథకాల కింద ప్రయోజనాలను అందించడంలో ఈ రైతు ఐడీ సహాయపడుతుంది. రాయితీ ఎరువుల పంపిణీలో పారదర్శకతను మెరుగుపరచడం, అవకతవకలను నివారించడం, పంట రుణాలు మరియు కిసాన్ క్రెడిట్ కార్డులను సులభంగా పొందేందుకు ఇది దోహదపడుతుందని కూడా భావిస్తున్నారు. భూమి రికార్డులను ఆధార్‌తో అనుసంధానించడం ద్వారా, ఈ వ్యవస్థ నిజమైన లబ్ధిదారులను గుర్తించడంలో సహాయపడుతుందని చెప్పారు. తద్వారా ప్రభుత్వ సహాయం అర్హులైన రైతులకు చేరేలా నిర్ధారిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

యుపి సిఎం తల్లి మృతి పట్ల గవర్నర్ శివప్రతాప్, సిఎం రేవంత్ సంతాపం

హైదరాబాద్,నవంబరు20,ప్రభాతవార్త: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాతృమూర్తి సావిత్రి దేవి మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.దివంగత సావిత్రి దేవి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో యోగి ఆదిత్యనాథ్‌కు, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన సంతాపం, ప్రగాఢ సానుభూతిని తెలియజే శారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాతృమూర్తి శ్రీమతి సావిత్రీ దేవి మృతి పట్ల తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు, వారి కుటుంబ సభ్యులకు గవర్నర్ తన సానుభూతిని తెలియజేశారు. దివంగత సావిత్రీ దేవి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించిన గవర్నర్, ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని, శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షి ంచారు.

డీలిమిటేషన్‌పై మాతో చర్చించలేదే..

కేంద్రం తీరుపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం

న్యూఢిల్లీ, నవంబరు 20: నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి పరిష్కరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. ఈ అం శంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రతిపక్ష పార్టీలను సంప్రదించలేదన్నారు.డీలిమిటేషన్ విషయంలో కాంగ్రెస్ 4అంశాలతో కూడిన సూత్రానికి కట్టుబడి ఉందని జైరాం రమేశ్ స్పష్టం చేశారు. లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 543గానే కొనసాగాలి.రాష్ట్రాల వారీగా లోక్‌సభ స్థానాల పంపిణీలో ప్రస్తుత నిష్పత్తిని కొనసాగించాలి. ప్రస్తుతం ఉన్న స్థానాల్లో మూడో వంతు 182 స్థానాలు మహిళలకు రిజర్వ్ చేయాలి.పై నాలుగు అంశాలకు సంబంధించి 25 ఏళ్లపాటు ఎలాంటి మార్పులు చేయకూడదు.ఈ నాలుగు అంశాలపై ఎన్డీపీ శరద్ పవార్ వర్గం, డీఎంకే సహా ఇండియా కూటమిలోని అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని రమేశ్ పేర్కొన్నారు.లోక్‌సభ స్థానాల సంఖ్యలో ఎలాంటి మార్పులు చేయకూడదని, డీలిమిటేషన్ కారణంగా తమిళనాడుకు అన్యాయం జరగకూడదని కోరుతూ ఆ రాష్ట్రంలో ఆమోదించిన తీర్మానానికి డీఎంకే కూడా మద్దతు ఇచ్చిందని ఆయన తెలిపారు.తనకు అందిన సమాచారం ప్రకారం, అధికార బీజేపీకి చెందిన ఎన్డీఏ మిత్రపక్షాలతో కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్‌పై స్పష్టమైన ప్రతిపాదనను పంచు కోలేదని జైరాం రమేశ్ ఆరోపించారు. ఏప్రిల్ 16న మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిం చడంతో పాటు డీలిమిటేషన్ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లు ను ప్రవేశపెట్టింది. ఆ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది.

డిసెంబర్‌లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు?

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.మహిళా రిజర్వేషన్ల అమలుతో పాటు డీలిమిటేషన్‌కు సంబంధించిన ప్రతిపాదిత బిల్లు కేంద్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన శాసన ప్రాధాన్యతగా మారే అవకాశముంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై రాజకీయ వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతున్న నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ఆగస్టు 13న పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం అధికారికంగా ముగించలేదు.

వాత్య కుట్ర కేసులో నిఖిల్ గుప్తాకు జైలు



వాషింగ్టన్, నవంబరు 20: ఖలిస్తానీ వేర్పాటువాద నేత, భారత్ చేత ఉగ్రవాదిగా ప్రకటించబడిన గురుపత్వంత్ సింగ్ పన్నూన్ హత్యకు కుట్ర పన్నిన కేసులో భారతీయుడు నిఖిల్ గుప్తాకు అమెరికా కోర్టు 235 నెలల జైలు శిక్ష విధించింది. అంటే 19 సంవత్సరాల 7 నెలల పాటు ఆయన జైలులో ఉండనున్నారు. ఇది 20 ఏళ్ల శిక్షకు కేవలం ఐదు నెలలు తక్కువ. అయితే ఈ హత్య కుట్రతో భారత ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని భారత్ గతంలోనే స్పష్టం చేసింది. నేరాన్ని అంగీకరించిన నిఖిల్ గుప్తాశిక్ష ఖరారు సందర్భంగా జరిగిన విచారణలో తన నేర అంగీకారాన్ని వెనక్కి తీసుకునే అవకాశం ఉందని న్యాయమూర్తి నిఖిల్ గుప్తాకు సూచించారు. అయితే ఆయన అందుకు నిరాకరించారు. మరోవైపు గురుపత్వంత్ సింగ్ పన్నూన్ కోర్టులో 45 నిమిషాలకు పైగా తన వాదనలు వినిపించారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో పన్నూన్ హత్యకు సంబంధించిన కుట్ర కేసులో నిఖిల్ గుప్తా తనపై ఉన్న ఆరోపణలను అంగీకరించారు. నిఖిల్ గుప్తాకు 12 సంవత్సరాల (144 నెలల) జైలు శిక్ష విధించాలని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టును కోరారు.అమెరికా ప్రాసిక్యూటర్లు మాత్రం గరిష్ఠంగా 293 నెలలు (24 సంవత్సరాల 5 నెలలు) శిక్ష విధించాలని విజ్ఞప్తి చేశారు. గుప్తా ఒంటరిగానే ఈ కుట్రలో పాల్గొన్నానని, ఎలాంటి శిక్షకైనా సిద్ధమని న్యాయమూర్తి విక్టర్ మరెరోకు లేఖ రాసినట్లు సమాచారం.

బకాయిపడిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు!

ప్రభుత్వానికి బియ్యం అప్పగించని మిల్లర్లపై చర్యలకు సుప్రీం అనుమతి

సీఎంఆర్ బియ్యమైనా ఇవ్వాలి లేదా సమానమైన నగదు చెల్లించాలి

హైదరాబాద్, నవంబరు 20.ప్రభాతవార్త: తెలంగాణ రైస్ మిల్లర్లకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కస్టమ్‌మిల్లింగ్ బియ్యం పెండింగ్‌లో ఉన్న వెంటనే తిరిగి ఇవ్వాలని స్టాకు లేని పక్షంలో దానికి తగిన విలువను పెనాల్టీతో సహా చెల్లించాలని సుప్రీంకోర్టు స్పష్టంగా రైసుమిల్లర్లను ఆదేశించింది. ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా బకాయిపడ్డ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది.తమపై ఎఫ్ఐఆర్‌ల రద్దు కోరుతూ రైస్ మిల్లర్లు వేసిన పిటిషన్లు కొట్టివేస్తూ డిఫాల్ట్ అయిన మిల్లర్లపై కేసులకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన 540 మిల్లుల యజమానులపై ఎఫ్ఐఆర్ నమోదైంది .వాటిని రద్దుచేయాలని తెలంగాణ రైస్ మిల్లర్లకు సుప్రీంకోర్టుకు పోతే ఎదురుదెబ్బ తగిలింది. డిఫాల్ట్ అయిన మిల్లర్లపై ఇప్పటికే ఇడి, సిఐడి,విజిలెన్స్‌దాడులు చేస్తూ కేసులు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా డిఫాల్ట్ మిల్లర్లపై 540 ఎఫ్ఎఆర్లు నమోదు కాగా వాటిని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో మిల్లర్ల తరపు న్యాయవాదులు తమ



పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన రైసుమిల్లరులు తమపై నమోదైన కేసులు తొలగించాలని దాఖలు చేయగా తెలంగాణ హైకోర్టులో జస్టిస్ జె శ్రీనివాసరావు మే 8న తీర్పు చెబతూ భారతీయ న్యాయ సంవిధ 316కింద సిఎంఆర్ ఇవ్వడంలో విఫలమైన మిల్లర్లపై ఎఫ్ఐఆర్‌లు రద్దు చేయాల్సిన అవసరంలేదని తీర్పును ఇచ్చింది. నిజాయితీ లేకుండా మోపూరితంగా వ్యక్తిగతంగా ఆర్థిక ప్రయోజనాలకోసం ధాన్యం మళ్ళించి దుర్వినియోగం చేశారని ప్రాథమికంగా గుర్తించదగిన నేరంకు విచారణ కూడా సెక్షన్ 281 ఏజెంట్ పరిధిలోకి రాదని కొట్టివేశారు. రైసుమిల్లర్లు కస్టమ్‌మిల్లింత్ కోసం కాంట్రాక్టు ఒప్పందం చేసుకొన్నారని ఎంఎస్‌పి పథం కింద ధాన్యం బియ్యంగా మార్చి కార్పొరేషన్‌కు ఇవ్వాలని హైకోర్టుకూడా తీర్పులో చెప్పింది. ప్రస్తుతం శుక్రవారం కూడా సుప్రీం కోర్టు పెండింగ్ బియ్యం అప్పగిం చకుంటే బకాయిలు చెల్లించాలని ఆదేశిం చింది. దీంతో మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సుప్రీం కోర్టు ఆదేశంతో లక్షల మెట్రిక్ టన్నుల బియాన్ని మిల్లర్లు పక్కదారి పట్టించినట్టు ఆరోపణలున్న మిల్లర్లపై పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడానికి ఉన్న అడ్డంకులు తొలిగిపోయాయి. మిల్లర్ల ఆస్తులు జప్తు చేయడాంతోపాటు రికవరి ప్రక్రియ వేగం పెంచే అవకాశం ఏర్పడింది. తెలంగాణ ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, ధాన్యం సేకరణ కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తూ దేశంలోనే అగ్రగామిగా ఉంది.

రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు, దేశవ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లక్షలాది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుట

TRUE VALUE

MARUTI SUZUKI

నమ్మకంతో అమ్మండి

TRUE VALUEలో మాత్రమే



CELEBRATING 60 Lakh+ STORIES OF TRUST

నేడే మీ దగ్గరలోని True Value డీలర్‌షిప్‌ను సందర్శించండి.

Download on the App Store | Google play

True Value యాప్‌ను ఇక్కడ డౌన్‌లోడ్ చేసుకోండి.

- ఫ్రీ హోమ్ ఎవాల్యూయేషన్
- సులభమైన RC ట్రాన్స్‌ఫర్
- సమయానికి చెల్లింపు

TRUE VALUE CERTIFIED

విచారణల కోసం కాల్ చేయండి 1800 102 1800 | సందర్శించండి www.marutisuzukitruevalue.com

KARIMNAGAR: ADARSHA AUTOWORLD: 7337442380 | **VARUN MOTORS**: 9640248417 | **ADARSHA AUTOMOTIVES**: 7799784428 **WARANGAL: ADARSHA AUTOMOTIVES, HANAMKONDA**: 8886236633 | **WIN MOTORS**: 8688827044 | **ADARSHA AUTO WORLD**: 9133382182 | **NALGONDA: PAVAN MOTOR**: 8790902165 | **NIZAMABAD: VARUN MOTOR**: 9052901777 | **MAHABUBNAGAR: SRI JAYARAMA MOTOR**S: 9642826963.

*నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి. వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి సమీపంలోని డీలర్‌షిప్‌ను సందర్శించండి. అద్దంపై నల్లటి ఛాయలు కనిపించడం లైటింగ్ ప్రభావం వల్ల జరుగుతుంది. సృజనాత్మక చిత్రీకరణ. ఉపయోగించిన చిత్రాలు కేవలం దృష్టాంత ప్రయోజనాల కోసం మాత్రమే.

Printed and Published by GireeshSurgeh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Supreme Printers (P) Ltd. and published at Plot No.4-401, Alugunnur, 'A' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034,35, FAX: 2277036; Editor : *DhameraSai Babu. *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.